MAHILA SADHIKARATHA

# మహిళా సాధికారత

స్వయంసహాయ ఉద్యమ సమాచార తెలుగు మాస పత్రిక

mas

సంపుటి: 20 సంచిక: 12 రంగారెడ్డి ఆగస్ట్ 2022 పేజీలు : 36 వెల : రూ. 10/-

## 'మహిళా సాధికారత' 20 వ వార్షికోత్సవ సంరంభం !



మహిళా సాధికారత 20 వ వార్షికోత్సవ ప్రత్యేక సంచిక ఆవిష్కరణ దృశ్యం



ఢిల్లీలో జర్మనీ రాయబార కార్యాలయ ప్రతినిధి ఎలీసా బెత్ రిచర్‌తో కూడిన జి ఐ జడ్ బృందం ఏపిమాస్ కార్యక్షేత్రాల సందర్శన





ఫుడ్ ప్రాసెసింగ్‌లో ఎఫ్ పి ఓల పాత్రపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్వహించిన రాష్ట్రస్థాయి వర్క్‌షాప్‌లో శ్రీ సి ఎస్ రెడ్డి పాల్గొన్న దృశ్యం




బీహార్ రాష్ట్ర రాజధాని పాట్నాలో ఎఫ్ పి ఓలు, ఎస్ హెచ్ జి సంస్థలపై ఏపిమాస్ , బి ఆర్ ఎల్ పి ఎస్ సంయుక్తంగా నిర్వహించిన రాష్ట్రస్థాయి వర్క్‌షాప్ దృశ్యం

PRAGATI OFFSET ప్రగతి ఆఫ్‌సెట్

NABARD నాబార్డ్ సౌజన్యంతో ....



नाबार्ड
అభివృద్ధి
కోసం
పారిశుధ్యం
నాబార్డు సౌజన్యంతో
చిరు ప్రయత్నం, గొప్ప ప్రగతి
స్వచ్ఛత ఉద్యమం
బహిరంగంగా బహిర్భూమికి వెళ్ళడం సరికాదు
మీ ఇంటి లోపల మరుగుదొడ్డి నిర్మాణం మంచి పరిష్కారం
गाँव बढ़े >> तो देश बढ़े
www.nabard.org
YouTube /nabardonline
Taking Rural India >>Forward

# మహిళా సాధికారత

సంపుటి 20 సంచిక 12



సంపాదకీయం

## వినోదం ... వికాసం !

ఏపిమాస్ 21వ వార్షికోత్సవం, మహిళా సాధికారత 20 వ వార్షికోత్సవాల సందర్భంగా మూడు రాష్ట్రాలలోని వివిధ ప్రాజెక్టుల సిబ్బందితో కూడిన ఏపిమాస్ కుటుంబం జులై ఒకటి, రెండు తేదీలలో హైదరాబాదులో ఒక్కచోటకు చేరి గతాన్ని నెమరువేసుకుని, సరదాలను, వినోదాలను పండించుకుంటూనే, సంస్థ బలాబలాలను, లోపాలోపాలను కొంతమేరకు సమీక్షించుకుని, 2030 నాటికి ఏపిమాస్ నిర్వహించవలసిన మరింత మెరుగైన పాత్ర గురించి, పుణికిపుచ్చుకోవలసిన కొత్తదనాన్ని గురించి, చేపట్టవలసిన సేవా కార్యక్రమాల విస్తృతి గురించి విహంగ వీక్షణం చేసింది. నిత్యనిర్ణీత కార్యక్రమాల నిర్వహణలో తలమునకలయ్యేవారిలో యిలాంటి ఆటవిడుపు సంరంభాలు కొత్త ఉత్సాహాన్ని నింపుతాయి. అందుకే యిలాంటి సమావేశాలకు అంత ప్రాధాన్యం! విన్నదానికంటె చదివినది, చదివినదానికంటె చూసినది మనస్సుపై మరింత గట్టి ముద్ర వేస్తాయని అంటారు కదా! ఆ నూతనోత్సాహం కొత్త ఆలోచనలను రేకెత్తించాలి, వ్యక్తిత్వ వికాసానికి, నైపుణ్యాల పెరుగుదలకు దోహదపడాలి, మరింత మెరుగైన, నాణ్యమైన నిర్వహణకు దారితీయాలి. ఆలా కాకుండా ఈ చెవితో విని ఆ చెవితో వదిలివేస్తే, ఈ కంటితో చూచి ఆ కంటితో విస్మరిస్తే యిక ప్రయోజనం ఏముంటుంది? ఇప్పుడు ఎఫ్ పి ఓ లు, స్వయంసహాయ సమాఖ్యలు, ఇతర యిలాంటి సంస్థల విషయం చూద్దాం. ఈ సంస్థల పాలకవర్గ సభ్యులకు, అధికారులకు, సిబ్బందికి ఏపిమాస్ వంటి వీటి ప్రోత్సాహక, మార్గదర్శక సంస్థలు నిర్వహణపరమైన వివిధ రకాల శిక్షణలు యిస్తుంటాయి. అంతేకాకుండా ముందే చెప్పినట్టు ఆదర్శ సూత్రాలను వినడం కంటె ఆచరణాత్మక సన్నివేశాలను చూడడం మరింత స్ఫూర్తిదాయకంగా వుంటుందనే ఉద్దేశంతో ఆదర్శ ఎఫ్ పి ఓలకు, స్వయంసహాయ సమాఖ్యలకు, యిలాంటి ఇతర సంస్థలకు అవగాహన పర్యటనలను నిర్వహిస్తాయి. తాము అప్పటికే శిక్షణ పొందిన ఎన్నో అంశాలను అక్కడ నేరుగా చూసే అవకాశం లభిస్తుంది. ఇంకా వారు అవలంబించే నూతన ఆచరణ విధానాలను, ప్రక్రియలను, ఆలోచనా ధోరణులను తెలుసుకునే, అవగాహన పెంచుకునే అవకాశం వుంటుంది. ఇలాంటి అవగాహన పర్యటనలను కేవలం విహార యాత్రలుగా వినోదించడం మాత్రమే కాకుండా వాటి ద్వారా తమ వ్యవహార శైలిలో, తమ సంస్థల నిర్వహణలో తీసుకురావలసిన మార్పుచేర్పులను నిశితంగా గమనించి, ఆ సవరణలు చేసుకోగలగాలి. లేకుంటే ఆ అవగాహన పర్యటనలు నిష్ప్రయోజనంగానే మిగులుతాయి. మనం సందర్శించే సంస్థలు అన్నీ అద్భుతమైన ప్రతిభ కనబరచేవే అని కాదు. వేటిలోనైనా కొన్ని లోపాలు కూడా వుంటాయి. వాటిని పరిశీలించినపుడు మనం అనుసరిస్తున్న విధానాలను, పాటిస్తున్న నియమాలను బేరీజువేసుకుని ఉత్తమమైన వాటినే కొనసాగించవచ్చు. ముఖ్యంగా పాలకవర్గ సభ్యులు, సి ఇ ఓలు యిలాంటి అవగాహన పర్యటనలను ఆషామాషీగా తీసుకోకుండా తమ సంస్థల మెరుగైన నిర్వహణకు వాటినుంచి ఎలాంటి స్ఫూర్తి పొందాలో ఆ చైతన్యాన్ని అందిపుచ్చుకోవాలి. పర్యటనలనుంచి తిరిగి వచ్చిన తర్వాత తాము గమనించిన, తమ సంస్థలకు సానుకూలమైన ఏవైనా మెరుగైన విధానాలు, మార్పుచేర్పులు వుంటే వాటిని వీలున్నంత శీఘ్రంగా తమ సంస్థలలో అమలుచేయగలగాలి. నిన్నటికి, నేటికి, రేపటికి తేడాలేకుండా అన్నీ ఒకేలా సాగుతుంటే ఇక వాటిని వేరువేరుగా పిలవడమెందుకు? మారనిదంటూ ఏదీ వుండదు. మార్పు అనేదే జీవన సూత్రం, నిత్య సత్యం! ఐతే ఆ మార్పు సానుకూలంగా సాగుతుందా, ప్రతికూలంగా మారుతుందా అనేది మన వివేకం మీద, అవగాహన మీదనే ఆధారపడి వుంటుంది. సాంకేతిక విప్లవంతో ప్రపంచమంతా అరచేతిలో యిమిడిపోతున్న నేటి రోజులలో అవకాశాలు అపారం! అసాధ్యం అనేదే కనిపించడం లేదు. కావలసింది ... తెలుసుకోవాలన్న ఆసక్తి, మలచుకోవాలన్న తపన. అవి వుంటే విజయం మన వెంటే! ఎందరో రైతుల జీవితాలను మెరుగుపరిచే అద్భుతమైన అవకాశం ఎఫ్ పి ఓ ల నిర్వాహకులకు లభించింది. ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ, వ్యాపారాత్మక వ్యవసాయ సూత్రాలను పాటిస్తూ, అభ్యుదయకరమైన ఆలోచనలను, విధానాలను, ప్రక్రియలను ఆహ్వానిస్తూ ఎఫ్ పి ఓలను బలోపేతం చేస్తారని ఆశిద్దాం!

Edited, Printed, Published and owned by **T.Chandra Sekhar Reddy;** Printed at Kala Jyothi Process Pvt.Limited, S No:185, Kondapur, Hyderabad-500133, Ranga Reddi District, Telangana;Published at Mahila Abhivruddhi Society, Andhra Pradesh (APMAS), Plot No.11&12, HUDAColony, Tanesha Nagar, Near DreamVally, Manikonda, Rangareddi District, Hyderabad-500089. **Editor:**T.Chandra Sekhar Reddy

ఆయినవారి మౌనం గుండెల్లో గునపం , అందుకే మాటామంతీ కొనసాగిస్తుండాలి

# మహిళా సాధికారత

ఎడిటర్ : **టి.చంద్రశేఖర రెడ్డి** అసోసియేట్ ఎడిటర్ : **జె.వి. కృష్ణమూర్తి**

ఎడిటోరియల్ కమిటి : ఏ. కళామణి, ఎస్. రామలక్ష్మి, ఎన్.వినాయకరెడ్డి, బి.వెంకటేశ్వర్లు

కంపోజింగ్, డిజైనింగ్ : ఎన్. రమాదేవి కన్సల్టెంట్ : కె.రఘురామరాజు


## లోపలి పేజీలలో ....


- ఆనందోత్సాహాలతో అక్షర నీరాజనం! ...05
- ఏపిమాస్ విలువ గొలుసు కార్యక్రమాలు భేష్ ...08
- భరోసా యిచ్చిన మగ్గం ఎంబ్రాయిడరీ ! ...10
- జరీ, కుందన్ నగిషీపనులతో ఆర్థిక స్వావలంబన ...11
- ఈ నెలలో ఈ వ్యవసాయపనులు ముఖ్యం ...12
- జీవాల పెంపకం... పాటించవలసిన అంశాలు ...16
- ఈ నలుగురు ... మహిళా శక్తికి ఆనవాళ్ళు ...18
- మేలైన సాగుకోసం మెరుగైన సూచనలు ! ...21
- కర్ణాటకలో అనంత ఎఫ్ పి ఓ ల బృందం ...23
- సంఘ 'బలానికి' సరైన చిరునామా ఈ వసంత ...25
- అభివృద్ధి పథంలో 'సిరిసంపద' ఎఫ్ పి ఓ ...27
- మహిళా సంఘటిత శక్తిగా ఎస్ హెచ్ జి లు ...28
- బంతి, చేమంతి సాగులో మెళకువలు ! ...29
- డ్రోన్‌కొనుగోలుపై ఎఫ్‌పిఓలకు 40% రాయితీ ...34
- ఎఫ్‌పిఓలకు రూ.2 కోట్ల వరకు రుణాలు ...34


## 'మహిళాభివృద్ధి సొసైటీ' (మాస్)

'మహిళా సాధికారత' పత్రిక మాతృసంస్థ మహిళాభివృద్ధి సొసైటీ. దీనిని ఏపిమాస్ అని, మాస్ అని కూడా సంక్షిప్తంగా పిలుస్తారు. 2001జూన్ 14 వ తేదీన పబ్లిక్ సొసైటీగా మహిళాభివృద్ధి సొసైటీ హైదరాబాద్ ప్రధాన కార్యాలయంగా ఏర్పాటైంది. తెలుగు రాష్ట్రాలలో, మన దేశంలోని ఇతర అనేక రాష్ట్రాలలో స్వయంసహాయ సంస్థల సుస్థిరాభివృద్ధికి విశేష సేవలను అందించిన ఈ సంస్థ ప్రస్తుతం రైతుల అభ్యున్నతికి, పర్యావరణ పరిరక్షణకు, ఆదర్శ గ్రామాల నిర్మాణానికి, స్వయంసహాయ సంస్థల స్వయం నియంత్రణకు గణనీయమైన కృషి చేస్తున్నది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ప్రధాన కార్యదర్శిగా పనిచేసి పదవీ విరమణ చేసిన శ్రీ కె. మాధవరావు ఛైర్మన్‌గా వివిధ రంగాలలో విశేషానుభవం గడించిన ప్రముఖులు ఈ సంస్థ పాలకవర్గంలో వున్నారు. సంస్థ వ్యవస్థాపక సి ఇ ఓ శ్రీ సి ఎస్ రెడ్డి ఎండి గా, సిఇఓ గా వున్నారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్, తెలంగాణా, బీహార్‌లలో కార్యక్రమాలను నిర్వహిస్తున్న ఈ సంస్థకు ప్రధాన కార్యాలయంతోపాటు, ఒక ప్రాంతీయ కార్యాలయం, 21 క్షేత్ర కార్యాలయాలు వున్నాయి. దాదాపు 250 మందికి పైగా సిబ్బంది వున్నారు. ప్రజలకు అవగాహన కలిగించడం కోసం మహిళా సాధికారత పత్రికతోపాటు వివిధ వైజ్ఞానిక పుస్తకాలను, ఈ సంస్థ ప్రచురిస్తుంటుంది.


| ప్రోత్సాహక చందా | | |
|---|---|---|
| ఏడాదికి | : | రూ. 110 |
| రెండేళ్ళకు | : | రూ. 200 |
| మూడేళ్ళకు | : | రూ. 280 |

| ప్రకటన ఛార్జీలు | |
|---|---|
| మల్టీకలర్ ఫస్ట్ పేజి (సగం)/బ్యాక్ పేజి(పూర్తి) | : రూ. 25,000 |
| మల్టీకలర్ ఇన్‌సైడ్ కవర్ పేజి (పూర్తి) | : రూ. 15,000 |
| బ్లాక్ అండ్ వైట్ లోపలి పేజి (పూర్తి) | : రూ. 10,000 |

**చందాలు లేదా ప్రకటనలకోసం పంపే డిడిలను 'ఏపిమాస్ -హైదరాబాద్' పేరుమీద పంపాలి**



మహిళా సాధికారత, ఏపిమాస్ కార్యాలయం, ప్లాట్ నెం.11-12, హుడా కాలని, తానీషా నగర్,
డ్రీమ్‌వ్యాలీ దగ్గర, మణికొండ, రంగారెడ్డి జిల్లా, హైదరాబాదు-500089. ఫోన్ : 08413-403118
Web: www.apmas.org, E Mail: info@apmas.org


ఆశాభావం అన్నిటినీ అనుకూలంగా మార్చే మంత్రదండం కాదు, దేనికైనా నిన్ను సిద్ధంచేసే మనోబలం !

# ఆనందోత్సాహాలతో అక్షర నీరాజనం!

## ఏపిమాస్ 21వ వార్షికోత్సవంలో ' మహిళా సాధికారత ' 20 వ పుట్టిన రోజు !

ఏపిమాస్ కుటుంబం అంతా ఒక్కటిగా ఒక్కచోట కలిసిన వేళ, ఆనందోత్సాహాలు ఉరకలు వేస్తున్న తరుణం, ఆహ్లాదకరమైన వాతావరణం తోడుగా, రెండు దశాబ్దాల జ్ఞాపకాల ఊసులతో ఏపిమాస్ 21వ వార్షికోత్సవం, ' మహిళా సాధికారత ' పత్రిక 20 వ పుట్టినరోజు వేడుకలు 2022 జులై 1,2 తేదీలలో హైదరాబాద్‌లోని 'ప్రగతి రిసార్ట్స్' లో



ఒకే ఒక్కడు ...

మనోరంజకంగా, వినోదంగా, వికాసంగా సాగాయి. ముందుగా మెడిటేషన్‌తో, ప్రార్థనా గీతంతో, జ్యోతి ప్రజ్వలనతో, ఏపిమాస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీ మధుమూర్తి స్వాగతోపన్యాసంతో ప్రశాంత గంభీరంగా మొదలైన మొదటిరోజు కార్యక్రమాలకు ఉత్సాహాన్ని జోడిస్తూ ఏపిమాస్ ఎండి, సి ఇ ఓ శ్రీ సి ఎస్ రెడ్డి ఆనాటి ఆ క్షణంలో ఎలాంటి అనుభూతిని అనుభవిస్తున్నదీ ప్రతి ఒక్కరూ ఒక్క మాటలో చెప్పండంటూ ప్రేరణ రగిలించారు. 'ఆనందం, ఆశ్చర్యం, ఉద్వేగం, అదృష్టం, సౌకర్యం, నిర్మలత్వం, ప్రకృతితో తాదాత్మ్యం, నూతనోత్సాహం, ఆసక్తికరం, ఆరాధనీయం, విజయ ప్రస్థానం, పండుగ, ఆలయంలో వున్నంతటి ప్రశాంతి, స్వేచ్ఛ, గుర్తుండిపోయే మధురక్షణం ... యిలా భావోద్వేగ ప్రకటనలు వెల్లువెత్తాయి.

అనంతరం శ్రీ సి ఎస్ రెడ్డి రెండురోజుల వార్షికోత్సవ కార్యక్రమాన్ని గురించి వివరిస్తూ, మొదటిరోజున గత ఏడాది కాలంలో ఏపిమాస్ సాధించిన ఫలితాల గురించి, ఏపిమాస్ విజన్ –2030 గురించి విశ్లేషణ, మహిళా సాధికారత పత్రిక 20వ పుట్టినరోజు వేడుక వుంటుందని చెప్పారు. అయితే పూర్తిచేసితీరవలసిన అజెండా అంటూ ఏమీ వుండదని, ఉత్సాహంగా పాల్గొని సలహాలు, సూచనలు యివ్వాలని కోరారు. రెండవరోజును పూర్తిగా సరదా కోసం కేటాయించినట్టు చెప్పారు. విశ్లేషణకు అనువుగా మొత్తం హాజరైనవారందరిని 5 బృందాలుగా (పృథ్వి, వరుణ, అగ్ని, వాయు, ఆకాశ్) చేసి, ఏ బృందానికి ఆ బృందంవారు చర్చించి చర్చా ఫలితాలను ప్రెజెంటేషన్ చేయాలని చెప్పారు.

**ప్రెజెంటేషన్లపై పాపారావు విశ్లేషణ**

ప్రెజెంటేషన్ల అనంతరం ఎస్ వి పి (సోషల్ వెంచర్ పార్ట్నర్స్) ప్రతినిధి శ్రీ పాపారావు ప్రెజెంటేషన్ల సారాంశాన్ని విశ్లేషిస్తూ, ఏపిమాస్ తాను నిర్దేశించుకున్న విజన్ 2030ని సాధించడానికి ఆర్థిక పరివర్తన లేదా సామాజిక పరివర్తన తెచ్చే సంస్థగా ఎలా రూపుదిద్దుకోవాలనే విషయమై ఆలోచనలను ప్రేరేపిస్తూ విషయ వివరణ చేశారు.

**సి ఎస్ లేని ఏపిమాస్ లేదు ...**

అనంతరం ఏపిమాస్ ఛైర్మన్ శ్రీ కె. మాధవరావు క్లుప్తంగా మాట్లాడుతూ, ఏపిమాస్ సాధించిన విజయాలను, నిర్దేశించుకున్న లక్ష్యాలను, ఎంచుకున్న మార్గాన్ని వివరించారు.



సంస్థను ఉత్తమమైన రీతిలో నడిపిస్తున్నందుకు శ్రీ సి ఎస్ రెడ్డిని ఆయన అభినందించారు. ఇటీవల ఒకసారి శ్రీ సి ఎస్ రెడ్డి తనతో మాట్లాడుతూ, తనకు 60 ఏళ్ళు నిండనున్నాయని, సంస్థ నిబంధన మేరకు తాను సి ఇ ఓ గా తప్పుకోవలసి వుంటుందని చెప్పారని అంటూ, అందుకు తాను అంగీకరించలేదని, ఆయన ఏపిమాస్‌కు యావజ్జీవిత సి ఇ ఓ గా వుండాలని కోరారు. 'సి ఎస్ లేకపోతే ఏపిమాసే లేదు' అంటూ శ్రీ మాధవరావు ఏపిమాస్‌ను ఈస్థాయికి తేవడంలో నిత్యకృషీవలుడుగా శ్రీ సి ఎస్ రెడ్డి కనబరుస్తున్న అంకితభావంతో కూడిన అకుంఠిత దీక్షను కొనియాడారు. అమెరికాలో కీలక పదవులకు గరిష్ఠ వయోపరిమితి అంటూ ఏమీ వుండదని, వారు ఆరోగ్యం సహకరించిన మేరకు జీవిత పర్యంతం పదవులలో కొనసాగుతారని శ్రీ మాధవరావు ఉదాహరించారు.

**ప్రత్యేక సంచిక ఆవిష్కరణ**

ఏపిమాస్ ఆధ్వర్యంలో ప్రచురితమవుతున్న 'మహిళా సాధికారత' పత్రిక 20 సంవత్సరాలు పూర్తిచేసుకున్న సందర్భంగా, 20 ఏళ్ళ జ్ఞాపకాలతో , పత్రికను గురించిన వివిధ విశేషాలతో ప్రచురించిన ' ప్రత్యేక సంచిక 'ను పాలకవర్గ సభ్యులు, శ్రీ పాపారావు తదితర ముఖ్య అతిథులు, సిబ్బంది కరతాళ ధ్వనుల మధ్య ఆవిష్కరించారు. పత్రికా నిర్వహణ ఎన్నో వ్యయప్రయాసలతో కూడినదైనప్పటికి 'మహిళా సాధికారత' పత్రిక 20 ఏళ్ళుగా నిరాఘాటంగా ప్రచురింపబడుతుండడం, అందునా ఒక స్వచ్ఛంద సంస్థ యింతకాలంగా ఆ పత్రికను, ఎంతో విలువైన సమాచారంతో, నాణ్యంగా, సమర్థంగా నడపగలగడం సాధారణ విషయంకాదని శ్రీ సి ఎస్ రెడ్డి ఈ సందర్భంగా పేర్కొంటూ, పత్రికను ఎంతో చక్కగా తీసుకు వస్తున్నందుకు పత్రిక అసోసియేట్ ఎడిటర్ శ్రీ జె వి క్రిష్ణమూర్తిని అభినందించారు. శ్రీ క్రిష్ణమూర్తిని, గత దశాబ్దకాలంలో మహిళా సాధికారత పత్రికకు ఎక్కువగా వ్యాసాలు రాసిన యితర పదిమందిని శాలువాలతో శ్రీ రెడ్డి సన్మానించారు. అందరికంటె ఎక్కువ వ్యాసాలు రాసిన శ్రీ ప్రహ్లాద్‌కు, శ్రీ జె వి క్రిష్ణమూర్తికి నగదు బహుమతులు ప్రకటించారు.



మహిళా సాధికారత పత్రిక 20 ఏళ్ళ ప్రస్థానంలోని కీలక ఘట్టాలను గురించి, చేకూరిన గౌరవ ప్రతిష్ఠలను, గుర్తింపును గురించి శ్రీ జె వి క్రిష్ణమూర్తి క్లుప్తంగా వివరించారు.

**సాంప్రదాయిక దుస్తులలో ... కిరీట ధారణతో ...**

మొదటిరోజు సాయంత్రం ప్రకృతి సోయగాన్ని, చల్ల గాలిని ఆస్వాదిస్తూ పచ్చని మైదానంలో వేడుక తిరిగి మొదలైంది. ముందుగా అనుకున్నట్టుగా ఏపిమాస్ సిబ్బంది సాంప్రదాయిక దుస్తులలో ఈ వేడుకకు హాజరైనారు. కొద్దిసేపటికే చిరుజల్లులు పడడంతో కార్యక్రమం పక్కనే వున్న హాలులోకి మారింది. శ్రీ జి శ్రీనివాస్, శ్రీమతి అనూష, శ్రీ రాజశేఖర్ , శ్రీ శశివర్ధన్, శ్రీ గోవింద్ , శ్రీ లింగేష్ ప్రభృతుల నిర్వహణలో ఏపిమాస్ సిబ్బందిలో వారివారి ప్రత్యేకత, సామర్థ్యం, నైపుణ్యం, వ్యక్తిత్వాన్ని ఒక్క మాటలో వ్యక్తంచేస్తూ రూపొందించిన రంగురంగుల



ముందడుగుతో బలం, కలసి నడవడంతో ఐకమత్యం, ఒకరికొకరు నిలవడంతో అనుబంధం



అట్టకిరీటాలను ధరింపజేస్తూ సాగిన సరదాలపర్వం నవ్వులు పంచింది.

అనంతరం ఏపిమాస్ 21వ వార్షికోత్సవం, ' మహిళా సాధికారత ' పత్రిక 20 వ వార్షికోత్సవాన్ని స్ఫురింపజేస్తూ రూపొందించిన కేక్ కటింగ్ జరిగింది.

ఈ సందర్భంగా శ్రీ జె వి క్రిష్ణమూర్తి 'మహిళా సాధికారత ' పత్రిక 20 ఏళ్ళ ప్రస్థానంలో ఒక్కొక్క సంవత్సరానికి ఒక పత్రిక ముఖపత్రాల ప్రదర్శనను, పత్రిక విశిష్టతలను ప్రత్యేకతలను వివరించే ప్రెజెంటేషన్ చేశారు.

**సరదా సరదాగా వినోదాల విందు ...**

రెండవ రోజు పూర్తిగా సరదాలతో, వినోద కార్యక్రమాలతో ఉల్లాసంగా సాగింది. ఉదయాన్నే ప్రకృతి ఒడిలోనడక వ్యాయామంతో మొదలై బెలూన్ గేమ్, టగ్ ఆఫ్ వార్, ట్రెజర్ హంట్ వంటి ఆటలతో ఆనందంగా సాగింది. ఈ రెండు రోజుల కార్యక్రమాలపైన సిబ్బంది ఎంతో సంతోషంగా, ఉత్సాహంగా స్పందించారు. 'అద్భుతం, కాలమే తెలియలేదు, కొత్త శక్తిని నింపింది, మళ్ళీ మళ్ళీ దొరకని అనుభవం, ఎంతో ఆనందించాం, ఎలాంటి ఆందోళన లేకుండా నిర్విచారంగా గడచింది, ఎంతో ఉత్సాహంగా ఉల్లాసంగా వుంది, జిందాబాద్ ' వంటి ఎన్నో విశేషణాలతో వారు తమ అనుభూతులను వ్యక్తీకరించారు.

ఈ రెండురోజుల కార్యక్రమాలలో ఛైర్మన్ శ్రీ కె. మాధవరావు, డైరెక్టర్లు శ్రీ ఎన్ వి రమణ, శ్రీ శంభుప్రసాద్, శ్రీమతి సంధ్యారాణి, శ్రీమతి గౌరీకృష్ణ, సి ఇ ఓ శ్రీ సి ఎస్ రెడ్డి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీ మధుమూర్తి, ఇంకా ...శ్రీ పాపారావు, శ్రీమతి కళామణి, శ్రీమతి రామలక్ష్మి, మూడు రాష్ట్రాలనుంచి వచ్చిన ఏపిమాస్ సిబ్బంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమం అందరిలో నూతనోత్సాహాన్ని, ఉత్తేజాన్ని , స్ఫూర్తిని నింపింది. ■



ఇతరులు చూడలేనిదానిని చూడగలగడమే దార్శనికత్వం, సాధించడమే సామర్థ్యం

# ఏపిమాస్ విలువ గొలుసు కార్యక్రమాలు భేష్ !

## ప్రశంసించిన జర్మనీ రాయబార కార్యాలయ ప్రతినిధి ఎలిజబెత్ రిచర్

– ఎస్. ప్రహల్లాద

**ఆం**ధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అవిభక్త చిత్తూరు జిల్లాలో 8 మండలాలలో జి ఐ జడ్ – జర్మని వారి సహకారంతో 'హరిత వినూత్న కేంద్ర' (జి ఐ సి) పథకంలో భాగంగా వివిధ రకాల టమాట విలువ గొలుసు కార్యక్రమాలను



ఏపిమాస్ సంస్థ అమలు చేస్తున్న విషయం మహిళా సాధికారత పాఠకులకు విదితమే.

ఈ కార్యక్రమాలను తిలకించడానికి ఢిల్లీలో జర్మని రాయబార కార్యాలయ (బిఎంజడ్) ప్రతినిధి మిసెస్ ఎలిజబెత్ రిచర్, బెంగళూరు జిఐజడ్ కార్యాలయం నుండి మిసెస్ లిసా, శ్రీ శశికుమార్‌ల బృందం కురబలకోట రైతు ఉత్పత్తిదారుల సంస్థ (ఎఫ్ పి ఓ) నిర్వహించే రైతు సమృద్ధి కేంద్రాన్ని 2022 జులై 8 వ తేదీన సందర్శించారు. వీరితోపాటు ఏపిమాస్ సంస్థ నుండి ఎండి, సి ఇ ఓ శ్రీ సి.ఎస్. రెడ్డి, ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీ వినాయక రెడ్డి, ఏపిమాస్ ప్రాజెక్ట్ మేనేజర్ల బృందం ఈ సందర్శనలో పాల్గొన్నారు. వీరందరూ 'రైతు సమృద్ధి కేంద్రం' ద్వారా చేపట్టిన వివిధ రకాల మార్కెటింగ్ కార్యక్రమాలను పరిశీలించి, సంస్థ కార్యవర్గ సభ్యులతో వాటిని గురించి చర్చించారు.

అనంతరం మండలంలోని అడవిపల్లిని సందర్శించి అక్కడ అమలులో వున్న వివిధ రకాల పంట యాజమాన్య పద్ధతులలో భాగంగా 'పొలంబడి'లో పాల్గొని స్థానిక రైతులతో కలసి ఏపిమాస్ సంస్థ చేపట్టిన వివిధ రకాల విలువ గొలుసు కార్యక్రమాలను పరిశీలించారు. ఏపిమాస్ , సెల్కో సంస్థలు సంయుక్తంగా అందజేసిన సౌరశక్తి స్ప్రేయర్లు, పాలు పితికే యంత్రాలను తిలకించి వాటి ఉపయోగంపై రైతులతో ముచ్చటించారు.

ఆ తరువాత బృంద సభ్యులు ఆసియా ఖండంలోనే ప్రసిద్ది గాంచిన మదనపల్లి టమాట మార్కెట్‌ను సందర్శించి అక్కడ జరిగే మార్కెటింగ్ లావాదేవీలను మార్కెట్ కమిటి కార్యదర్శి శ్రీ అభిలాష్ గారిని అడిగి తెలుసుకున్నారు. శ్రీ అభిలాష్ గారు మదనపల్లి మార్కెట్‌లో జరిగే కార్యక్రమాలను, ఈనాం ద్వారా జరిగే అమ్మకాలను బృంద సభ్యులకు వివరించారు.

అనంతరం వ్యవసాయ మార్కెట్ ప్రాంగణంలో ఏపిమాస్ ద్వారా ఏర్పాటు చేసిన రైతు వనరుల కేంద్రాన్ని సందర్శించి అక్కడ చేపట్టే వివిధ రకాల కార్యక్రమాలను పరిశీలించారు. మర్యాదరామన్నపట్నం రైతు ఉత్పత్తిదారు సంస్థ చేపట్టిన వివిధ రకాల మార్కెటింగ్ కార్యక్రమాలను సంస్థ ప్రతినిధులు శ్రీమతి మంజుల, శ్రీమతి భార్గవి, ఏపిమాస్ ప్రాజెక్ట్ మేనేజరు శ్రీ



బలం అంటే ఇష్టంలేనివాటిని నాశనం చేయడం కాదు, ఇష్టమైనవాటిని కష్టమైనా సృష్టించుకోవడం




వాసుదేవరెడ్డి కమిటీ సభ్యులకు వివరించారు. కార్యక్రమం చివరిలో మదనపల్లి ఎన్.వి.ఆర్. లేఅవుట్‌లో వుండే ఏపిమాస్ సంస్థ కార్యాలయాన్ని కూడా సందర్శించారు.

ఈ కార్యక్రమం అనంతరం ఎలిజెబెత్ రిచర్ గారు తమ పరిశీలనలో గమనించిన అంశాల గురించి జిఐసి ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీ గేరిట్ గారితో ఈ క్రింది విధంగా పంచుకున్నారు.

క్షేత్ర స్థాయిలో కొద్ది సమయమే గడిపినప్పటికి క్షుణ్ణంగా పరిశీలించాము. జిఐజడ్/బిఎంజడ్ కార్యక్రమాలలో భాగస్వామిగా ఏపిమాస్ చాలా మంచి కార్యక్రమాలను నిర్వహిస్తుండడం చాలా ఆనందదాయకంగా వుంది. ఏపిమాస్ సిబ్బందిలో వుండే సానుకూల దృక్పథం, వారు చూపే చొరవ చాలా అభినందనీయం.

బలమైన, ఆచరణీయమైన, సుస్థిరమైన రైతు ఉత్పత్తి దారుల సంస్థలను ఏర్పాటు చేయడంపై భారతదేశం ప్రత్యేక మైన దృష్టి పెట్టడం జరుగుతున్నదని, ఈ కార్యక్రమాలు వ్యవసాయ విలువ గొలుసు అభివృద్ధికి అత్యంత అవసరమని నేను గ్రహించాను. ఇతర అన్ని దేశాలలోని జిఐజడ్ పథకాలలో కూడా భారతదేశపు విధానాలను ఆచరిస్తే బాగుంటుందని నాకు అనిపించింది. భారతదేశం అవలంబించే రైతు కేంద్రీకృత విధానాలు చాలా బాగున్నాయి' అని ఆమె ప్రశంసించారు.

రైతు ఉత్పత్తిదారుల సంస్థలలో స్త్రీ పురుష సమానత్వం, మహిళా నాయకత్వంపై చేపట్టిన కార్య క్రమాలు చాలా ప్రసంశనీయంగా వున్నాయని ఆమె అభిప్రాయపడ్డారు.

టమాట విలువ గొలుసులో భాగంగా అమలు చేసిన మంచి పద్ధతులు అనగా ఎర పంటలు, కంచ పంటలు. వివిధ రకాల బంక అట్టలు, సోలార్ ట్రాప్స్, సోలార్ స్ప్రేయర్లు, రైతు పొలంబడి పద్ధతులు చాలా ప్రశంసనీయమని ఆమె పేర్కొన్నారు

మదనపల్లి ప్రాంతంలో ఏర్పాటు చేసిన ఈ సందర్శన చాల బాగా సాగిందని, ఈ సందర్శనలో భాగస్వాములైన జిఐసి ప్రాజెక్ట్ సంచాలకులు శ్రీ వినాయక రెడ్డి, వారి బృందం శ్రీ అమరేంద్ర, శ్రీ అబ్దుల్ ఖాదర్, డాక్టర్. ప్రహల్లాద, డాక్టర్ వాసుదేవరెడ్డి, శ్రీ రమేష్‌రెడ్డి గారలు, భవ్య, పద్మజ గారలు, ఇతర సిబ్బంది సేవలు ఎంతో బాగున్నాయని ఆమె కొనియాడారు.

■

## స్టేట్ బ్యాంక్ చే ఏపిమాస్‌కు అంబులెన్స్

స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా సామాజిక బాధ్యత (సి ఎస్ ఆర్) లో భాగంగా అంబులెన్సును ఎస్ బి ఐ పరిపాలన విభాగం రాజమండ్రి వారి నుండ ఏపిమాస్‌కు ఎస్ బి ఐ అమరావతిసర్కిల్ జనరల్ మేనేజర్ శ్రీ క్రిషన్ శర్మ, ఎస్ బి ఐ పరిపాలన కార్యాలయం డిప్యూటీ జనరల్ మేనేజర్ శ్రీ సురేష్ ప్రభు చేతుల మీదుగా గ్రామీణ పేదలకు అత్యవసర సమయంలో ఆరోగ్య సేవలను అందించడం కోసం అంబులెన్సును అందజేశారు. ఈకార్యక్రమంలో ఎస్ బి ఐ చీఫ్ మేనేజర్ శ్రీ యస్. శోభన్ బాబు, ఏపిమాస్ రీజియనల్ కోఆర్డినేటర్ శ్రీ ఆర్. భాస్కర రావు పాల్గొన్నారు.

■



# భరోసా యిచ్చిన మగ్గం ఎంబ్రాయిడరీ !

**నా** పేరు నవిత. శ్రీ పెంటయ్య మా నాన్న గారు. నేను సరియైన ఆదాయం లేక కుటుంబ పోషణ భారమై సతమతమవుతున్న వేళ నాబార్డ్ వారి ఆధ్వర్యంలో మైత్రి మహిళా డెవలప్‌మెంట్ సొసైటి వారు మగ్గం ఎంబ్రాయిడరీలో ఉచితంగా శిక్షణ ఇస్తున్నారని తెలిసి జాయిన్ అయి పూర్తి శిక్షణ తీసుకున్నాను. తరువాత ఆ మగ్గం ఎంబ్రాయిడరి వర్క్‌నే వృత్తిగా చేసుకొని పని ప్రారంభించాను. మొదట్లో సరియైన ఆదరణ లభించక కొద్దిగా నిరాశ ఎదురైంది. అయినా వెనకడుగు వేయికుండా నా వర్క్‌ను మెరుగుపరచుకుంటూ ముందుకు సాగాను. క్రమేపి నా వర్క్ నచ్చి ఆర్డర్స్ పెరుగుతూ, నా ఆదాయం కూడా పెరుగుతూ వచ్చింది. అందువల్ల యిప్పుడు నేను నా కుటుంబాన్ని ఏ లోటూ లేకుండా పోషించుకోగలననే ఆత్మవిశ్వాసంతో సంతోషంగా ఉన్నాను. ఇందుకు కారణమైన నాబార్డ్, మైత్రి మహిళా డెవలప్‌మెంట్ సొసైటి వాళ్ళకు ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను. ■



తోడు లేకపోతే చిన్న ప్రయాణమైనా నరకమే, మనసుకు నచ్చిన తోడుంటే నరకంలోనైనా స్వర్గమే !

# జరీ, కుందన్ నగిషీ పనులతో ఆర్థిక స్వావలంబన!



మెదక్ జిల్లాకు చెందిన శ్రీమతి శ్వేత (వయసు: 34 సంవత్సరాలు) వాళ్ళది పేద కుటుంబం. ఆమె భర్త శ్రీ బాల్‌రాజు. ఆయన రోజు కూలీగా పని చేస్తుంటారు. శ్రీమతి శ్వేత డిగ్రీ చదువు కున్నారు.శ్రీరామ్ సంఘం ఎస్‌హెచ్‌జి గ్రూప్‌లో ఆమె ఒక సభ్యురాలు. ఈ దంపతులకు యిద్దరు పిల్లలు. శ్రీ బాల్ రాజు రోజు కూలీ ద్వారా సంపా దించే కొద్దిపాటి మొత్తం కుటుంబ అవసరాలకు సరిపోయేది కాదు. ఒక్కోసారి ఆ రోజు కూలీ పని కూడా దొరికేది కాదు.

నాబార్డ్ ఆర్థిక సహాయంతో జీసస్ వెల్ఫేర్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ అనే స్థానిక స్వచ్ఛంద సంస్థ వారు జరీ వర్క్, కుందన్ వర్క్‌పై నిర్వహించిన శిక్షణ కార్యక్రమాలలో ఆమె ఉత్సాహంగా పాల్గొని అనేక సాంకేతికాంశాలను నేర్చుకున్నారు.

15 రోజుల శిక్షణ పూర్తిచేసుకుని శ్రీమతి శ్వేత టైలరింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేసుకున్నది. ఇంటి వద్ద జరీ వర్క్, కుందన్ వర్క్ చేస్తారు. ఇప్పుడు ఆమె నెలకు 9,000–10 వేల రూపాయలు సంపాదించ గలుగుతున్నారు. పండుగల రోజులలో ఆమె యింకా ఎక్కువ సంపాదిస్తారు.



ఇప్పుడు శ్రీమతి శ్వేత ఎంతో సంతోషంగా వున్నారు. తాను ఎంచుకున్న జీవనోపాధి ద్వారా లభిస్తున్న ఆదాయం ఆమె కుటుంబానికి సరిపోవడమే కాకుండా, వారు కొంత సొమ్ము బ్యాంకులో దాచుకోగలుగు తున్నారు. వివిధ రకాల నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాల ద్వారా గ్రామీణ మహిళలు స్వావలంబనతో జీవించడానికి తోడ్పడుతున్న నాబార్డ్ వారికి ఆమె ధన్యవాదాలు తెలియజేశారు.

■

# ఈ నెలలో ఈ వ్యవసాయ పనులు ముఖ్యం సుమా!

– శ్రీను, అనూష, లిఖిత

**రెం**డు తెలుగు రాష్ట్రాలలోని చాలా జిల్లాల్లో జులై నెలలో మామూలు వర్షపాతం లేదా కొన్ని జిల్లాల్లో అధిక వర్షపాతం నమోదైంది. అందువల్ల వివిధరకాల పంటలు వేసుకోవడానికి పరిస్థితి అనుకూలంగా వుంది. ఈ తరుణంలో ఏఏ రకాల పంటల సాగు విషయంలో ఎలాంటి చర్యలు చేపట్టాలో, ఏ విధమైన జాగ్రత్తలు పాటించాలో తెలుసుకుందాం.

**వరి**

బోరుబావులు, ఇతర నీటివసతి కలిగిన రైతులు యిప్పటికే నార్లు పోశారు. ముందుగా నార్లు వేసుకున్న జిల్లాల్లో ఇప్పుడు నార్లు పిలకదశ నుండి దుబ్బు కట్టే దశలో ఉన్నాయి. అయితే ఇంకా తెలంగాణాలోని ఏ జిల్లాల్లో అయినా నార్లు వేసుకోకపోతే ఆగస్ట్ నెల మొదటి వారంలో స్వల్పకాలిక సన్నగింజ రకాలైన తెలంగాణా సోన, కూనారం రైస్–2, డబ్ల్యుజిఎల్ – 962, జగిత్యాల సన్నలు, జగిత్యాల సాంబ లేదా దొడ్డు గింజ రకాలైన జె జి ఎల్ – 24423, కూనారం సన్నలు, బతుకమ్మ మర్ర్యు యం టి యు – 24423 వంటి ఎరాకలను వెదజల్లే లేదా డ్రమ్ సిడరతో విత్తుకోవటం మంచిది.

అలాగే ఆంధ్రప్రదేశ్‌లో ఇంద్ర, స్వర్ణ, అమర, సాంబ మసూరి, యం.టి,యు 1224, యం.టి,యు 1226 బాపట్ల సన్నాలు , నెల్లూరు సోన వంటి రకాలను వేసుకోవాలి. ఒకవేళ నాటు వేసే యంత్రాలు అందుబాటులో ఉంటే, ట్రే పద్ధతిలో లేదా పాలిథిన్ షీట్ పైన నాట్లు వేసుకొని 17 – 20 రోజులలో యంత్రం సహాయంతో (వాకింగ్ టైపు యంత్రాలు, రైడింగ్ టైపు యంత్రాలు) నాట్లు వేసుకోవాలి.

కొన్ని జిల్లాల్లో నీటి విడుదల ఆలస్యం అవటం వలన వరినాట్లు ఆలస్యం అవుతాయి. ఆ సందర్భంలో స్వల్పకాలిక రకాల నార్లు అందుబాటులో ఉంటే సెప్టెంబర్ మొదటి వారంలో నాట్లు పూర్తి చేసుకోవాలి.

వరి నారు పీకిన తరువాత నారును శుద్ధి చేయాలి. అలా చేయటం వల్ల నేల ద్వారా వ్యాప్తి చెందే కొన్ని రకాల చీడపీడల నుండి పొలాన్ని తొలి దశలో కాపాడుకోవచ్చు. నారు శుద్ధి సేంద్రియ విధానంలో ట్రైకోడెర్మా 4 గ్రా, ఒక లీటర్ నీటికి కలిపి నారు శుద్ధి చేసుకోవాలి లేదా ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో జీవామృతం ద్వార నారును శుద్ధి చేసుకోవాలి.

నారుమడిలో అధికంగా కాండం తొలిచే పురుగును, ఉల్లి కోడును నివారించడంకోసం నారు మడులను ఎండా కాలంలో సిద్ధం చేసుకునేటప్పుడే లోతుగా దున్ని వేపపిండి మందంగా వేసుకోవాలి. తద్వారా నేలలో నివాసం ఉండే గుడ్లను, హానికారక కీటకాలను నివారించవచ్చు. లేదా నారు నాటిన తర్వాత నారుపైన వేపనూనె (500 పిపిఎం) 5 మి.లీ, ఒక లీటర్ నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.



*కాండం తొలిచే పురుగు*

జులై , ఆగష్టు నెలలలో వీచే గాలిలో, కురిసే వానలో తేమశాతం అధికంగా ఉంటుంది. ఇటువంటి ప్రతికూల వాతావరణ పరిస్థితులు వివిధ దశల్లో ఉన్న నారుమడిలో అగ్గితెగులు ఆశించడానికి దారితీస్తాయి.

దీని నివారణ కోసం కార్బండిజం 2.5 గ్రా, లీటర్ నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.

ఏమి అన్నావనేదానికంటె ఎలా అన్నావనేది ముఖ్యం, మనసును ఒప్పించినా నొప్పించినా అది మాటతీరే !

పొలాన్ని దమ్ము చేయకముందు పొలంలో ఒక ఎకరాకు ఒక టన్ను బాగా మాగిన పశువుల ఎరువును వేసుకున్నట్ల యితే మంచి ఫలితాలు పొందవచ్చు. ప్రధాన పొలాన్ని 10-12 రోజుల పాటు మురగనిచ్చి దమ్ము చేయాలి. ఆఖరి దమ్ములో ఎకరాకు 16 కిలోల నత్రజని, 24 కిలోల భాస్వరం, 15 కిలోల నత్రజని, 14 కిలోల పోటాష్ ఎరువులు వేసుకోవాలి.

సాధారణంగా వానాకాలంలో వరి పంటకు తెగుళ్లు ఎక్కువగా వచ్చే ఆస్కారం వుంటుంది. వీటిని నివారించుకోవ డానికి సిఫార్సు చేసిన మోతాదులో 3-4 సార్లు నత్రజని సంబంధిత ఎరువులను వేసుకోవాలి లేదా నత్రజని సంబంధిత జీవన ఎరువులను (అజటోబాక్టర్/ అజో స్పైరిల్లమ్) డ్రిప్ ద్వారా, లేదా బాగా ఎండిన పెంట ఎరువులతో కలిపి మొక్కలకు అందించాలి.

వరినారు నాటిన తరువాత ప్రధానంగా కలుపు సమస్య వస్తుంది. కలుపు నివారణకై ఎకరాకి 4 కిలోల బెన్సల్ఫ్యూరా న్మిథైల్ 0.6 % జీఆర్ం ప్రీటిలాక్లోర్ 6% ఆర్గుళికలు నాటిన 3 - 5 రోజుల లోపు 20 కిలోల ఇసుకలో కలిపి చల్లాలి.

గత కొన్నిసంవత్సరాల అనుభవాల దృష్ట్యా ముందుగా వేసిన దీర్ఘకాలిక లేదా మధ్యకాలిక రకాలలో ఆగస్ట్ నెలలో వరి పంటకు ఎక్కువగా బాక్టీరియా ఎండు తెగుళ్లు వచ్చే అవకాశం ఉంది. తెగుళ్ల ఉధృతి ఎక్కువగా వుంటే నత్రజని ఎరువులు వేయడం తాత్కాలికంగా నిలిపివేయాలి.

తొలిదశలో వ్యాప్తిని అరికట్టడానికి కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రా + ప్లాంటమైసిన్ 0. 4 గ్రా, లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి.

**మొక్కజొన్న**

జులై, ఆగస్ట్ నెలలలో వర్షపాతం ఎక్కువగా వుంటుంది. మొక్కజొన్న లేతదశలో ఉన్నపుడు అధిక తేమను తట్టుకోలేదు. ఈ పరిస్థితిని నివారించటానికి పొలంలో నీరు నిలవకుండా జాగ్రత్తపడాలి. అలాగే వర్షపునీటిని కాలువల ద్వారా బయటికి పంపాలి. పంట పరిస్థితిని బట్టి 19-19- 19/20-20-20/ 13-0-45 ఎరువులను తక్కువ మోతాదులో వేసుకోవాలి. అలాగే వ్యామ వంటి జీవన ఎరువులను వేసుకోవటం వలన వేరుకు సోకే తెగుళ్ళ నుండి కీటకాల నుండి కాపాడుకోవచ్చు.

ముఖ్యంగా రబీ సీజన్‌లో మొక్కజొన్నకు లేతదశలో కత్తెర పురుగు సోకుతుంది. దీని నివారణకు 10-12 రోజుల పైరుపై వేపనూనె 5 మి.లీ లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి లేదా ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పొగాకు కాషాయం, అగ్ని అస్త్రం వంటి కషాయాల ద్వారా నివారించు కోవాలి. పురుగు ఉధృతి ఎక్కువ ఉంటే ఎమామెకన్ బెంజోయేట్ 0.4 గ్రా, లేదా కోరాబాన్ 0.4 మీ.లీ ఒక లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి.

కత్తెర పురుగు నివారణకు వాడే కషాయాలను లేదా మందు ద్రావణాలను నేరుగా మొక్క సుడిలో పడునట్లు సాయంకాలం వేసుకోవాలి.

25-30 రోజుల వయసున్న మొక్కజొన్న పైరులో అంతర కృషి చేసి ఎకరాకు 50 కిలోల నత్రజని ఎరువులను లేదా జీవన ఎరువులను పైపాటుగా వేసుకోవాలి. అలాగే వేర్ల మీదికి మట్టిని ఎగదోయాలి.

పొడతెగులు ఆశించినచో నేలకు దగ్గరిలో ఉన్న ఆకులను తొలగించి పొలంలో కలుపు లేకుండా శుభ్రం చేసుకోవాలి. ప్రొపికోనజోల్ 1 మీ, లీ లేదా కార్బెడిజమ్ 3గ్రా, ఒక లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి.ఆకుముడత లేదా ఆకు ఎండు తెగుళ్ళ నివారణకై కార్బెండజిమ్ 2.5 గ్రా లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి.

**పత్తి**

సకాలంలో వర్షాలు ఉన్నాయి కాబట్టి చాలా జిల్లాల్లో పత్తి పంట పెరుగుదల దశలో ఉన్నాయి. అలాగే కలుపు సమస్య కూడా పెరిగే అవకాశం ఉంది.

ప్రస్తుత దశలో పత్తి పంటలో గొర్రు, గుంటకతో దాదాపు 10 రోజులకొకసారి అంతర కృషి చేయాలి. దీనివలన కలుపు నివారణ అదుపులో ఉండి భూమిలో తేమశాతం నిలబడి మొక్కల పెరుగుదల బాగుంటుంది.

పత్తిపంటలో గడ్డిజాతి కలుపు నివారణకు క్విజాలోఫాప్ - ఇథైల్ఎకరాకు 400 మి.లీ, గడ్డిజాతి మరియు వెడల్పాటి

కలుపు నివారణకు క్విజాలోఫాప్-ఇథైల్ 450 మి.లీ. తో పాటు పైరిథియోబాక్సోడియం 250 మి.లీ లేదా ప్రొపాక్విజాఫాప్ 250 మీలీ ఎకరాకి పిచికారీ చేయాలి. కలుపు లేతదశ (2-4 ఆకుల దశ ) పిచికారీ చేసుకుంటే కలుపు నివారణ బాగుంటుంది.

పత్తిపంటకు కాంప్లెక్స్ ఎరువులు అనగా 19-19-19 లేదా 12-32-16 లేదా 26-20-0-13 లేదా 10-26-26 లేదా 17-17-17 లేదా 13-0-45 వంటి ఎరువులు భూమిలో తేమశాతం ఉన్నపుడు 15-20 రోజుల లోపు వేసుకోవాలి.

ప్రస్తుతం పత్తిపంటను పేనుబంక, పచ్చదోమ, తామర పురుగులు మొదలగు రసంపీల్చే పురుగులు ఆశిస్తాయి. పంట లేతదశలో రసంపీల్చే పురుగు నివారణకై ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పొగాకు కషాయం, వావిలాకు కషాయం, వేపనూనె వంటి మిశ్రమ మందులను పిచికారీ చేయాలి.



వేరుకుళ్లు తెగులు సోకినట్టు లేదా మొక్కలు ఎండిపోవడం గమనించినట్లు అయితే ఎకరాకు 600 గ్రా, ట్రైకోడెర్మా లేదా సూడోమోనాస్ 200 లీటర్ల నీటికి కలిపి భూమి బాగా తడిసేలా పోయాలి. లీటర్నీటికి 2 గ్రా కార్బండిజమ్ం మాంకోజెబ్ వంటి మిశ్రమ మందులను మొక్క చుట్టూ బాగా తడపాలి.

**వేరుశనగ**

వానాకాలంలో విత్తిన వేరుశనగ ప్రస్తుతం 20-30 రోజుల పంట దశలో ఉంటుంది.

ఈ దశలో పంట బెట్టకు గురైతే ఒక నీటి తడిని ఇవ్వటం ద్వారా పంట ఒకేసారి పూతకు వస్తుంది.

విత్తిన 25 రోజుల లోపు గుంటుక సహాయంతో అంతర కృషి చేసినట్లయితే వెడల్పాటి ఆకుల కలుపును లేదా గడ్డికలుపును నివారించవచ్చు లేదా ఇమాజితాఫీర్ 10% 300 మి.లి లేదా ఇమాజమోక్స్ 35%, ఇమాజితా ఫీర్ 35% అనే కలుపు మందును 400 గ్రా, 200 లీటర్ నీటిలో కలిపి ఎకరాకు పిచికారీ చేయాలి.



మొలకకు కుళ్ళు ఆశించినట్లు అయితే 2 గ్రా, ట్రైకోడెర్మా మందును మొక్క దగ్గర పోయాలి లేదా కార్బెడిజమ్ మాంకో జెబ్ 2.5 గ్రా, లీటర్ నీటికి కలిపి మొదళ్ళు బాగా తడిసేలా పిచికారీ చేయాలి.

శనగపచ్చ పురుగు లేదా పొగాకు లద్దె పురుగు నివారణకు ప్రకృతి వ్యవసాయపద్ధతిలో వావిలాకు కషాయం లేదా పొగాకు కషాయం పిచికారీ చేయటం వలన నివారించ వచ్చు. అలాగే నోవాల్యురాన్ 200 మి.లీ లేదా ఇమామెక్టిన్ బెంజోయేట్ 60 గ్రా, 200 లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి.

**సోయా చిక్కుడు**

సోయా చిక్కుడు పంట ప్రస్తుతం 35-50 రోజుల దశలో (శాఖీయ- పూతదశ ప్రారంభం) ఉంది.

ఇటీవల కురిసిన అధిక వర్షాల వల్ల నీటిముంపు ఏర్పడి మొక్కల ఎదుగుదల నిలిచిపోతుంది. అలాగే పోషకాల లోపం ఏర్పడుతుంది. ముందుగా పొలంనుండి నీటిని కాలువల ద్వారా బయటికి పంపాలి.

ప్రధాన పోషకాల లోపాలను సవరించడానికి నీటిలో కరిగే ఎరువులైన 19-19-19 / 20-20-20/13-0-45 నత్రజని, భాస్వరము, పొటాష్‌లను లీటర్ నీటికి 10 లేదా 20 గ్రా. వారం రోజుల వ్యవధిలో రెండుసార్లు వేసుకోవాలి.

పైరు లేతదశలో వేరుకుళ్లు ఆశించి మొక్కలు ఎండిపోయి చనిపోవటం గమనించినట్లయితే లీటర్ నీటికి 3 గ్రా, ట్రైకో డెర్మావిరిడె లేదా సూడోమోస్ ద్రావవణాలను చెట్టు మొదల్లో పోయాలి లేదా లీటర్ నీటికి 3 గ్రా, కాపర్ ఆక్సిక్లోరైడ్ లేదా

**నిజమైన ఆనందానికి చిరునామా నీ తోడ్పాటుతో సంతోషంగా జీవించేవారి కళ్లలో చిందే చిరునవ్వు**

2 గ్రా, కార్బండిజమ్ మాంకోజెబ్ మిశ్రమ మందులను కలిపి మొక్క చుట్టూ భూమి తడిసేలా పోయాలి.

పొగాకు లద్దెపురుగు / ఆకుముడత ఆకుచుట్టుపురుగు ఆశించినచో ప్రకృతి వ్యయసాయ పద్ధతిలో పొగాకు కషాయం లేదా అగ్నిఅస్త్రం లేదా వావిలకు కషాయం పిచికారీ చేసుకోవాలి. పురుగు ఉధృతి ఎక్కువ ఉన్నట్లు అయితే ఎకరాకు థయోడికార్బ్ 3 గ్రా, లేదా క్లోరోపైరిఫాస్ 500 మి.లీ లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి.

సోయా చిక్కుడు పంట గింజకట్టు దశలో పొలంలో సరైన తేమశాతం ఉన్నపుడు ఎకరాకు 25–35 కిలోల నత్రజని 10 కిలోల పొటాష్‌తో కలిపి మొక్క దగ్గర్లో నేలలో లోతుగా వేయాలి.

**టమాట**

గత నెలలో అధిక వర్షపాతం వుంటే ముందుగా పొలం నుండి కాలువల ద్వారా నీటిని బయటకు పంపాలి. పంట పరిస్థితిని బట్టి 19–19–19 వంటి కాంప్లెక్స్ ఎరువులను తక్కువ మోతాదులో మొక్కకు దూరంగా వేయాలి. అలాగే ట్రైకోడెర్మావిరిడె వంటి జీవన ఎరువులను మొక్క మొదలు బాగా తడిసేలా పోయాలి.

టమాటా పొలంలో ప్రతి 14 వరసలకు ఒక వరుస వంతున రక్షక పంటగా (ఎర పంటగా) బంతిపూల వరుసను వేయాలి. అలాగే పొలం చుట్టూ 3 వరసల్లో జొన్న లేదా సజ్జ వంటి ఎర / సరిహద్దు పంటలను వేయటం ద్వారా రసం పీల్చే పురుగు ఉధృతి తగ్గుతుంది.

**మామిడి**

కిందటి నెలలో కురిసిన వర్షాలకు కలుపు సమస్య ఎక్కువగా ఉంటుంది. దీని నివారణకు తోటలో ట్రాక్టర్ సహాయంతో అంతర కృషి చేసి పచ్చిరొట్ట ఎరువుల పంటను (జనప నారు, జీలుగు) వేసి పూత దశలో 8 నుండి 10 వారాలలో కలియదున్నాలి. అలాగే ఇప్పుడు 'ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హార్టికల్చర్ రీసెర్చ్' (https://www.iihr.res.in) వారు పండ్ల తోటలలో కలుపు నివారణకు భూమిలో నత్రజనిని స్థాపన చేసే దూలగొండి పంటను విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ఈ పంట వలన ప్రధాన పంటలో కలుపు నివారణతో పాటు నేలలో నత్రజనిని స్థాపితం చేస్తుంది. ఇంతేకాకుండా దూలగొండి మొక్క అనేక ఔషధ గుణాలు కలిగి ఉంటుంది.

■

## సైకిల్ చక్రంతో కలుపు తీసే యంత్రం

వ్యవసాయం రోజురోజుకూ భారమవుతోంది. నారు పోసిన నాటి నుంచి పంట ఇంటికి వచ్చేవరకూ ఎన్నో ఖర్చులు. చివరకు కలుపు తీయాలన్నా కూలీల ఖర్చు తడిసి మోపెడవుతోంది. అయితే ఈ కలుపు ఖర్చు తగ్గించు కునేందుకు ఓ యువ రైతు వినూత్నంగా ఆలోచించాడు.



కర్నూలు జిల్లా మద్దికెర మండలం ఎం. అగ్రహారం గ్రామానికి చెందిన రాజశేఖర్ చిన్న పిల్లల సైకిల్ చక్రం సాయంతో కలుపు తీసే యంత్రాన్ని తయారు చేశాడు. సైకిల్ చక్రానికి ఇరువైపులా ఇనుప కడ్డీలు అమర్చి, దానికి చిన్న గుంటక అనుసంధానం చేశాడు.

ఎలాంటి ఇంజన్ అవసరం లేకుండా, కేవలం చేతులతో నెట్టుకుంటూ పోతే చాలు. చక్రానికి ఏర్పాటు చేసిన గుంటక కలుపు మొక్కలు తొలగిస్తుంది. దీన్ని తయారు చేయడానికి రూ. 1500 మాత్రమే ఖర్చు చేసినట్లు రాజశేఖర్ తెలిపాడు. నల్లరేగడి పొలంలో తాను 3 ఎకరాల్లో పత్తి సాగు చేశానని, పొలంలో కలుపు తీయా లంటే ఎద్దులతో దుక్కికి రూ. 1500, కూలీలకురూ. 1000, ఇలా రోజుకి రూ. 2500 ఖర్చవుతుందని చెప్పాడు. ఈ యంత్రంతో ఆ ఖర్చు మిగులుతుందని తెలిపాడు.

■

# జీవాల పెంపకం... పాటించవలసిన అంశాలు

–డాక్టర్ భార్గవి



| నెల | పాటించవలసిన అంశాలు |
|---|---|
| జనవరి | • అమ్మతల్లి , చిటుకు రోగానికి టీకాలు వేయించాలి.<br>• ఎక్కువ శాతం జీవాలు ఈ నెలలో ఈనుతాయి కాబట్టి పచ్చిమేత పుష్కలంగా లభించేటట్లు చూసుకోవాలి.<br>• షెడ్డుల్లో తేమ లేకుండా చూసుకోవాలి.<br>• జీవాల్ని చలి నుండి కాపాడి న్యుమోనియా సోకకుండా జాగ్రత్త పడాలి. |
| ఫిబ్రవరి | • కుంటలు , చెరువులలో నీరు ఇంకిపోతుంది కాబట్టి గొర్రెలకు జలగ వ్యాధి నివారణ మందులు త్రాగించాలి.<br>• జీవాల్లో పిడుదులు , గోమార్ల నివారణకు బాహ్య పరాన్నజీవుల నిరోధక మందులను పిచికారి చేయాలి. |
| మార్చి | • ఈ నెలలో గొర్రె / మేక పిల్లలు మూడు మాసాల వయస్సుకు వస్తాయి, కనుక తల్లి నుండి వేరు చేసి ప్రత్యేక షెడ్డులలో వుంచి పచ్చిమేతను తినటం అలవాటు చేయాలి.<br>• జీవాలకు నోటి పుండ్లు , పారుడు రోగ వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి.<br>• బీడు భూముల్లో మేత తగ్గిపోతుంది కాబట్టి షెడ్డుల్లో అదనంగా ఎండు మేత, సైలేజి, దాణా పెట్టాలి.<br>• ఉన్నినిచ్చే గొర్రెలలో ఉన్నిని కత్తిరించాలి. |
| ఏప్రిల్ | • తల్లి నుండి వేరు చేసిన పిల్లలకు అమ్మతల్లి టీకాలు వేయించాలి.<br>• గొర్రెలను, మేకలను మధ్యాహ్న సమయంలో (11–4 గం. మధ్య) మేపుకు తీసుకుని వెళ్లరాదు.<br>• గొర్రెల పాకలో నీటి తొట్టెలను అమర్చి ఎళ్లవేళలా శుభ్రమైన నీరు అందుబాటులో వుండేటట్లు చూసుకోవాలి. |

| | |
|---|---|
| బమే | • ఈ నెలలో భూమి బీడుబారి పచ్చి మేత దొరకదు. కాబట్టి సుబాబుల్, అవిశ,తుమ్మ, వేప మొదలగు పశుగ్రాస చెట్ల ఆకుల ద్వారా జీవాలను మేపుకోవాలి.<br>• చూడి జీవాలకు దాణా అదనంగా ఇవ్వాలి. చిటుకు వ్యాధి నిరోధక టీకాలను ఈ నెలలో కచ్చితంగా వేయించాలి.<br>• ఉన్ని జాతి గొర్రెలలో , మేకలలో ఉన్నిని కత్తిరించాలి. |
| జూన్ | • ఎక్కువ శాతం గొర్రెలు, మేకలు ఎదకు వస్తాయి కాబట్టి జాగ్రత్తగా గమనించి చూలు కట్టించాలి.<br>• ఈ నెలలో నట్టల నివారణ మందులు కచ్చితంగా త్రాగించాలి.<br>• విత్తనపు పొట్టేళ్ళు ఆరోగ్యంగా, బలిష్టంగా వుండేటట్లు చూసుకోవాలి. |
| జులై | • గొర్రెలు , మేకలు వర్షంలో తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.<br>• నేల బురదగా వుంటుంది కాబట్టి గిట్టల మధ్య భాగం మెత్తబడి పుండ్లు ఏర్పడతాయి. దీని నివారణకు ఫుట్‌బాత్ ను షెడ్లో ఏర్పాటు చేయాలి.<br>• షెడ్లో తేమ లేకుండా , వ్యాధులు ప్రబలకుండా సున్నం చల్లుకోవాలి.<br>• వర్షాలు ఎక్కువగా వున్నప్పుడు షెడ్డులలోనే సుబాబుల్,అవిశ,వేప,తుమ్మ మొదలగు ఆకులను మేపాలి. |
| ఆగస్టు | • ఎక్కువ శాతం గొర్రెలు ఈ నెలలో గర్భం దాల్చి వుంటాయి కాబట్టి ఎక్కువ దూరం నడిపించరాదు.<br>• షెడ్డులలో ఉన్నప్పుడు కచ్చితంగా దాణా ఇవ్వాలి లేని యెడల పిల్లలు ఆరోగ్యంగా పుట్టవు.<br>• జూన్ – జులై మాసాల్లో ఎదకు రాని గొర్రెలను , మేకలను గుర్తించి తగిన చర్యలు తీసుకుని గర్భం దాల్చేటట్లు చూసుకోవాలి. |
| సెప్టంబర్ | • గర్భ కోశ సమస్యలతో కట్టలేని గొర్రెలకు తగిన చికిత్స చేయించాలి. |
| అక్టోబరు | • ఎక్కువ శాతం గొర్రెలు చివరి దశ గర్భంలో ఉంటాయి కాబట్టి పచ్చి మేత , దాణా ఎక్కువగా లభ్యమయ్యేటట్టు చూసుకోవాలి.<br>• ఈ నెలలో విత్తనపు పొట్టేళ్ళను మార్చుకోవటం మంచిది. |
| నవంబరు | • ఈ నెలలో గొర్రెలు , మేకలు ఎక్కువ ఈనుతాయి. కాబట్టి తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. తల్లి దగ్గర సరిపడా పాలు త్రాగేటట్లు శ్రద్ధ వహించాలి.<br>• పాల ఉత్పత్తికి పచ్చి మేతను , దాణాను తల్లి గొర్రెకు సమృద్ధిగా ఇవ్వాలి. |
| డిసెంబరు | • ఈ నెలలో గొర్రెలకు, మేకలకు పుట్టిన పిల్లలకు మొదటి మోతాదు నట్టల నివారణ మందు త్రాగించాలి. ■ |

# ఈ నలుగురు ... మహిళా శక్తికి ఆనవాళ్ళు !

– వాసు, ప్రాజెక్ట్ మేనేజర్

గ్రీన్ ఇన్నోవేషన్ సెంటర్ (జి.ఐ.సి) ప్రాజెక్ట్ ద్వారా ఏపిమాస్ ప్రోత్సాహంతో 8 మండలాలలో ఏర్పాటైన 8 ఎఫ్.పి.ఓ లు , ఎఫ్.పి.ఓ ల సమాఖ్యతో కలిపి మొత్తం 9 ఎఫ్.పి.ఓ లలో నలుగురు మహిళలు సి.ఇ.ఓ.లుగా బాధ్యతలు సమర్ధంగా నిర్వహిస్తున్నారు. పట్టణాలు, ఏసి గదులలో పనిచేయాలనుకొనే రోజులలో ఎండనకా వాననకా, పగలనక రేయనకా, పొలాల వెంబడి, రైతుల వెంబడి తిరుగుతూ, తాము వచ్చిన గ్రామీణ ప్రాంతాలలోని అన్నదాతల అభ్యున్నతికి 'మేము సైతం' అంటున్నారు. అత్యంత సంక్లిష్టమైన వాతావరణంలో, ఆటు–పోట్లను ఎదుర్కొంటూ, వివిధ రకాల సేవలనందిస్తూ ముందుకు సాగుతున్నారు. వ్యాపారాలు, సంస్థలు నిర్వహించడానికి బిజినెస్ మేనేజిమెంట్ చదువులే అవసరం లేదని, అంకిత భావం, సానుకూల దృక్పధం, పట్టుదల వుంటే చాలని నిరూపిస్తున్నారు. ఆ నలుగురి గురించి మరింత వివరంగా చూద్దాం ...

**మర్యాదరామన్నపట్నం ... శ్రీమతి ఆర్.భార్గవి**

జనవరి 5 వ తేదీన పురుడు పోసుకున్న మర్యాదరామన్నపట్నం ఎఫ్.పి.సి. కి నాలుగవ సి.ఇ.ఓ గా శ్రీమతి ఆర్.భార్గవి బాధ్యతలు చేపట్టారు. తను 1 సంవత్సరం 10 నెలలుగా సి.ఇ.ఓ గా విధులు నిర్వహిస్తున్నారు. 30 సంవత్సరాల భార్గవి చదువుకున్నది బి.టెక్ కంప్యూటర్స్. గతంలో కొన్నాళ్ళు జూనియర్ లెక్చరరుగాను , ఒక సాఫ్ట్‌వేర్ కంపెనీలోను పని చేశారు. ఎక్కువ కాలం పాటు హోం మేకర్ (గృహిణి) గానే వున్నారు.



తనకు వచ్చిన అవకాశాన్ని అందిపుచ్చుకొని, తన ఎఫ్.పి.సి. పరిధిలోని 1335 మంది రైతుల అభ్యున్నతికై ఆమె కృషిచేస్తున్నారు. వ్యవసాయంలో తనకు ఎలాంటి అనుభవం లేక పోయినా, కుటుంబాలను నడిపిన మహిళలకు సంస్థలను నడపడం ఒక లెక్కా అంటూ, ఎఫ్.పి.సి. డైరెక్టర్లను, సిబ్బందిని సమన్వయ పరచుకొంటూ, వారి సలహాలు, సూచనలు, సహకారంతో, వ్యూహాలను మార్చుకొంటూ, ఎంతో పోటీగల మదనపల్లి పట్టణంలో గత 2 ఆర్థిక సంవత్సరాలు వరుసగా రూ.1 కోటి 5 లక్షలు, రూ.87 లక్షల టర్నోవరు నిర్వహించారు.

ఇన్పుట్ (ఉత్పాదకాల) షాపు (ఎఫ్.డి.సి) పట్టణం మధ్యలో వున్నప్పటికి వ్యాపారం జరగకపోవటాన్ని అర్థం చేసుకొని, స్థావరాన్ని పట్టణం వెలుపలికి మార్చి, మార్చిన 4 నెలలలోనే రూ.94 లక్షల వ్యాపారం చేసి, ఎఫ్.పి.సి సుస్థిరతపై భరోసాను కల్పించుకొన్నారు. ఈ ఉత్సాహంతో 2022–23 ఆర్థిక సంవత్సరానికి రూ.2 కోట్ల పైచిలుకు ఇన్పుట్ వ్యాపారాన్ని లక్ష్యంగా నిర్దేశించుకొన్నారు.

> ***స్త్రీ అని ఆందోళన చెందకుండా ఎన్ని సవాళ్ళు ఎదురైనా తనకున్న సామర్థ్యాలను చక్కగా వినియోగిస్తూ ఎఫ్.పి.సి ని ముందుకు నడిపిస్తున్న సి.ఇ.ఒ.***
>
> ***– గిరీష్, టెక్నికల్ కోఆర్డినేటర్***
>
> ***ఆమె చిరునవ్వు ఎలాంటిసమస్యనైనా పరిష్కారం చేయగలదన్న నమ్మకం ఆమెలో కనిపిస్తుంది. కష్టపడి పనిచేస్తారు. నమ్మకమైన వ్యక్తి. – ఊర్మిళ, రైతుమిత్ర***

అదేవిధంగా, ఉద్యానశాఖ వారి సహకారంతో కూరగాయలు , పండ్ల సేకరణ కేంద్రాన్ని ఏర్పాటు చేసుకొని, రూ.45 లక్షల అవుట్ పుట్ వ్యాపారం చేయుటకు ప్రణాళికలు చేసుకొన్నారు.

**రామసముద్రం ... కుమారి వి.అంబిక**

ఆకలి బాధలెరిగిన అనంతపూరు జిల్లానుంచి వచ్చిన కుమారి అంబిక గారి వయస్సు 22 సంవత్సరాలే



అయినప్పటికీ, 'పిట్టకొంచెం-కూతఘనం' మాదిరిగా చిత్తూరు జిల్లాలోనే కాకుండా, ఏపిమాస్ ఏర్పాటు చేసిన ఎఫ్.పి.ఓ లలో 2,162 మంది సభ్యత్వం కలిగిన అతిపెద్ద ఎఫ్.పి.ఓ కి సి.ఇ.ఓ గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

తను అగ్రికల్చర్ డిప్లొమా చదువుకొని, ఉద్యోగంలో చేరి, విధులు నిర్వహిస్తూ, ఉన్నత విద్యాభ్యాసంపై ఉన్న ఆసక్తితో బి.ఎస్‌సి. పట్టభద్రురాలైనారు. గతంలో, ముగ్గురు పురుషులు

> *వాణి ఎఫ్.పి.ఓ. సి.ఇ.ఓ ఉద్యోగానికి సరి అయిన వ్యక్తి. ఎఫ్.పి.ఓ.లో పుస్తక నిర్వహణ, మార్కెటింగ్ నైపుణ్యాలు బాగున్నాయి. మహిళ అయినప్పటికి , కూరగాయల మార్కెటింగ్ బాగా చేస్తున్నారు. రైతు సేవాకేంద్రం నిర్వహణ బాగుంది.*
>
> *- అమరేంద్రుడు, ప్రాజెక్టు మేనేజర్*
>
> *నిరంతరం నేర్చుకొనే తత్వం, సిబ్బందితో, పాలక వర్గంతో మంచి మానవ సంబంధాలు కల్గి చాకచక్యంతో పనులను చక్కబెట్టుకోవడం అంబిక గారి గొప్పతనం.*
>
> *- రమేష్ రెడ్డి, ప్రాజెక్టుమేనేజరు*

సి.ఇ.ఓ. లుగా బాధ్యతలు చేపట్టి నెలలపాటే సేవలందించి విరమించిన నేపథ్యంలో, తను బాధ్యతలు చేపట్టి ఎఫ్.పి.ఓలతో పనిచేసిన అనుభవంతో, రైతులకు సేవలందించాలనే పట్టుదలతో ఒక సంవత్సరం 8 నెలలుగా సేవలందిస్తున్నారు.

ఇన్‌పుట్ రంగంలో మన రాష్ట్రంలోనే కాకుండా, ప్రక్కనే వున్న కర్నాటకకు వెళ్ళి క్రొత్త డీలర్లను, తయారీదార్లను గుర్తించి వారి నుండి వ్యవసాయ ఉత్పాదకాలను కొనుగోలు చేస్తున్నారు. అదేవిధంగా, అవుట్ పుట్ వ్యాపారంలోను ప్రాసెసర్స్‌కి, హోల్ సేలర్స్‌కి, రిటైలర్స్‌కి పండ్లు-కూరగాయలు ఎఫ్.పి.ఓ. ద్వారా సరఫరాచేస్తూ తనదైన ముద్ర వేశారు.

రామసముద్రం ఎఫ్.పి.ఓ. 2020-21, 2021-22 ఆర్థిక సంవత్సరాలలో వరుసగా రూ.25.39 లక్షలు, రూ.35.20 లక్షల అవుట్ పుట్ వ్యాపారం చేసి, మొదటి స్థానంలో నిలిచిందంటే, అందులో అంబికగారి చురుకైన పాత్ర స్ఫురణకు రాక మానదు. కార్యవర్గ సభ్యులు, ఎఫ్.పి.ఓ. సిబ్బంది, ప్రోత్సాహక సంస్థ సహకారంతోనే ఇదంతా సాధ్యమయిందని, అంబిక గారు వినమ్రతతో తెలియజేశారు.

ఇదే స్ఫూర్తితో 2022-23 ఆర్థిక సంవత్సరంలో రూ.143.70 లక్షల ఇన్పుట్ వ్యాపారం, రూ.70.95 లక్షల అవుట్‌పుట్ వ్యాపారం లక్ష్యంగా నిర్దేశించుకొన్నట్లు తెలియజేశారు.

**పలమనేరు 'కౌండిన్య' ... కుమారి బి.సి.వాణి**

28 సంవత్సరాల ఈ లెక్కలమ్మ రకరకాల సమీకరణాలతో, ఆటు-పోట్లను ఎదుర్కొంటున్న, 764 మంది వాటాదారులతోవున్న ఎఫ్.పి.సి.ని సుస్థిరత వైపు నడిపిస్తున్నారు.



ఇటు ఉత్పత్తిదారులతోను, అటు కొనుగోలుదారులతోను సత్సంబంధాలను కలిగివుంటూ, అత్యంత సంక్లిష్టమైన అవుట్ పుట్ మార్కెటింగ్‌ను తనదైన శైలిలో నడిపిస్తూ ఎఫ్.పి.సి.కి ప్రధాన ఆదాయమార్గంగా లాభాలను ఆర్జించడంలో కీలకపాత్ర పోషిస్తున్నారు.

కూరగాయలతో పాటు ట్రక్కులలో వెళ్ళడం, కొనుగోలుదారులతో బేరమాడడం చాలా సునాయాసంగా చేయగలుగుతున్నారు.

అదేవిధంగా, ఏ.పి.మార్క్ ఫెడ్ వారితో నేరుగా మాట్లాడి ఎరువులు తెప్పించుకొంటున్న సి.ఇ.ఓ. వాణి గారు. కౌండిన్య ఎఫ్.పి.సి. ద్వారా 2020-21 ఆర్థిక సంవత్సరంలో రూ.35.20 లక్షలు, 2021-22 ఆర్థిక సంవత్సరంలో రూ.54.64 లక్షల వ్యాపారం చేసి, 2022-23 సంవత్సరానికి రూ.101.07 లక్షల వ్యాపారాన్ని లక్ష్యంగా నిర్దేశించుకొన్నారు. ఆమె పుస్తకాల నిర్వహణలోను, యంఐఎస్ నిర్వహణలోను దిట్ట.

ఏపిమాస్ ప్రధాన కార్యాలయం నుండి జరిగే సి.ఇ.ఓ.ల సమీక్షా కార్యక్రమంలో యంఐఎస్ నిర్వహణ గురించి చర్చ

పరస్పరం నమ్మకం అనుబంధానికి బలం, వారికోసం అవసరమైతే రాజీపడడం ఆ బంధానికి శాశ్వతత్వం

వచ్చినప్పుడు, అందులోని సాధ్యాసాధ్యాల గురించి మాట్లాడేప్పుడు 'నీవు చెప్పమ్మా వాణీ' అని ఏపిమాస్ ఎండి; సి.ఇ.ఓ. సి.ఎస్ రెడ్డిగారు ప్రత్యేకించి తనను అడుగుతారంటే ఆమె శక్తి–సామర్థ్యాలు ఏపాటివో మనం అర్థం చేసుకోవచ్చు.

**ఎం–టమాట ... శ్రీమతి పి.జె. మంజులాదేవి**

మదనపల్లి కేంద్రంగా ఏపిమాస్ ప్రోత్సాహంతో ఏర్పాటైన చిత్తూరుజిల్లా స్థాయి రైతుఉత్పత్తిదారు సంస్థల సమాఖ్య ఎం.టమాట రైతు ఉత్పత్తిదారుల కంపెనీలో సి.ఇ.ఓ.గా శ్రీమతి మంజులాదేవి బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం సమాఖ్యలో 14 ఎఫ్.పి.ఓ. లు సభ్యత్వం పొంది వాటాదారులుగా వున్నాయి. మరో 9 ఎఫ్.పి.ఓ.లు వాటాదారులుగా చేరనున్నాయి. అన్ని ఎఫ్.పి.ఓ. లలో ప్రస్తుతం 13 వేల మంది



రైతులు సభ్యులుగా వున్నారు. సభ్య ఎఫ్.పి.ఓ.లలోని రైతుల ఇన్‌పుట్ అవసరాలను దృష్టిలో వుంచుకొని కోరమండల్, ఇఫ్కో కంపెనీల నుండి ఎరువులను హోల్‌సేల్ డీలర్ షిప్ పొంది, ఎఫ్.పి.ఓ. లకు సముచిత ధరలకు నాణ్యమైన ఎరువులను సరఫరా చేస్తున్నారు. ఇ–ఫ్రెష్ వారితో ఒప్పందం చేసుకొని నాన్ లైసెన్స్ ఐటమ్స్‌ని ఏకమొత్తంగా కొని, సభ్య ఎఫ్.పి.ఓ. లకు సముచిత ధరలకు సరఫరా చేస్తున్నారు.

అదేవిధంగా, కరోనా సమయంలో మార్కెట్ సదుపాయం లేక, రైతులు తాము పండించిన టమాట పంటను కోయకుండా వదిలేసిన సమయంలో, గుజ్జు పరిశ్రమల వారితో మాట్లాడి, ఎఫ్.పి.ఓ.ల ద్వారా 2 సంవత్సరాలలో సుమారు 4 వేల మెట్రిక్ టన్నుల టమాటలను రైతుల నుండి కొనుగోలుచేసి గుజ్జు పరిశ్రమల వారికి సరఫరా చేయడంలో కీలక పాత్ర పోషించారు. ఈ విధంగా 2020–21 ఆర్థిక సంవత్సరంలో రూ.1.62 కోట్లు, 2021–22 ఆర్థిక సంవత్సరంలో రూ.2.23 కోట్లు టర్నోవరు చేసి, 2022–23 సంవత్సరానికి రూ.10.79 కోట్లు టర్నోవరును లక్ష్యంగా నిర్దేశించుకొన్నారు.

***నాకు తెలిసినంతవరకు కుటుంబం కన్నా రైతుల , మహిళల అభివృద్దే ముఖ్యమని తమ జీవితాలను అంకితం చేస్తున్న అతి తక్కువమందిలో శ్రీమతి మంజులగారు ఒకరు. అనేక ఒడిదుడుకులు ఎదుర్కొంటూ, సవాళ్ళను అధిగమిస్తూ సి.ఇ.ఓ.గా రాణిస్తున్నారు. – ప్రహ్లాద, ప్రాజెక్ట్‌మేనేజర్***

ఇవే కాకుండా, సోలార్ డి–హైడ్రేషన్ యూనిట్, కోల్డ్ యూనిట్‌ను నిర్వహిస్తూ రైతుల అభ్యున్నతికి కృషిచేస్తున్నారు. దీనికి ముందు మర్యాదరామన్న పట్నం ఎఫ్.పి.సి. సి.ఇ.ఓ.గా పనిచేస్తున్నప్పుడు, 2020 ఏప్రిల్‌లో కరోనా సమయంలో, ఎవరూ ఇండ్లనుండి వెలుపలికి రాని రోజులలో సైతం రైతుల నుండి ఎఫ్.పి.సి. ద్వారా పండ్లు–కూరగాయలు సేకరించి, కూరగాయల ట్రక్కుతోపాటు రాత్రి ప్రయాణంచేసి రెడ్ జోన్‌గా ప్రకటించి వున్న నాయుడుపేటకు వెళ్ళి శ్రీ 'అరబిందో ఫార్మా ఫౌండేషన్' వారు చేపట్టిన ఉచిత పండ్లు–కూరగాయల కార్యక్రమానికి నేను సైతం అంటూ పండ్లు–కూరగాయలను అందచేసి తిరిగి అదే ట్రక్కులో రావడం తన దైర్యానికి, నిబద్ధతకు నిదర్శనం. ■

## వారికి తల్లి పేరు చాలు: కేరళ హైకోర్టు

**అ**వివాహిత మహిళలు, అత్యాచార బాధితుల సంతానానికి ఇతరుల మాదిరిగానే అన్ని హక్కులూ ఉన్నాయని కేరళ హైకోర్టు స్పష్టం చేసింది. ప్రాథమిక హక్కులైన ప్రైవసీ, స్వేచ్ఛ, గౌరవం వంటివి ఉన్నాయని, వాటిలో చొరబడే అధికారం ఎవరికీ లేదని తెలిపింది. వారు ఈ దేశ పౌరులని, వారి హక్కులకు భంగం కలిగినప్పుడు కోర్టులు రక్షిస్తాయని పేర్కొంది.

పుట్టిన తేదీ ధృవపత్రాలు, గుర్తింపు పత్రాలు, ఇతర పత్రాల్లో కేవలం తన తల్లి పేరు మాత్రమే రాసుకోవచ్చని తెలిపింది. తండ్రి పేరు ప్రస్తావించాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ పి.వి. కున్హికృష్ణన్ ఆదేశాలు ఇచ్చారు. ■

# మేలైన సాగుకోసం మెరుగైన సూచనలు !

–చెంగల్రెడ్డి అనూష

వ్యవసాయరంగంలో వాతావరణ మూలకాలు, వాతావరణ అంశాల పాత్ర ఎంతో ముఖ్యం అయినది. నేటి అధునాతన వ్యవసాయ విధానాలు, వ్యవసాయ యాంత్రీకరణ, మారుతున్న సాంకేతికతలతో పాటుగా ముందస్తు వాతావరణ అంచనా, వాతావరణ సూచనల ఆధారముగా వ్యవసాయ పనులను చేపట్టడం వంటి అంశాలు కూడా నేటి అధునాతన వ్యవసాయంలో ముఖ్యమైన పాత్రను పోషిస్తున్నాయి.

ఈ వాతావరణ అంశాలపై అవగాహన కల్పించడం ముఖ్య ఉద్దేశంగా భారత వాతావరణ విభాగం (ఐ.ఎం.డి.), భూ శాస్త్ర మంత్రిత్వశాఖ (ఎం.ఒ.ఇ.ఎస్.) వారు మనదేశ వాతావరణ విశ్లేషణ, ముందస్తు వాతావరణ అంచనా నివేదికలను ప్రతిరోజు విడుదల చేస్తుంటారు.

ఈ ముందస్తు వాతావరణ సూచనల ఆధారంగా భారత వ్యవసాయ పరిశోధనా మండలి (ఐ.సి.ఎ.ఆర్.), అగ్రోమైట్ ఫీల్డ్ యూనిట్స్ లు రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం (ఎ.ఎం.ఎఫ్.యు), పరిధిలో మరియు జిల్లా వ్యవసాయ వాతావరణ విభాగం (డి.ఎ.ఎం.యు.) పరిధిలో జిల్లా, బ్లాక్/ సబ్ సూచనలను రైతులకు వివిధ మాధ్యమాల ద్వారా వ్యవసాయ సమాచారం అందిస్తున్నాయి.

వీటిలో కచ్చితమైన సమాచారాన్ని పొందుపరిచి రైతులకు, వాటాదారులకు చేరవేసే ముఖ్యమయిన డిజిటల్ మాధ్యమాలు.

భారత వాతావరణ విభాగం వారి imdagrimet.gov.in వెబ్ సైట్: వ్యవసాయ వాతావరణ శాఖ, వాతావరణ పరిశోధన, సేవల విభాగం, భారత వాతావరణ విభాగం, భూ శాస్త్ర మంత్రిత్వశాఖ వారి ద్వారా ఈ imdagrimet.gov.in వెబ్ సైట్ రూపొందించబడింది.

- ఈ వెబ్ సైట్లో దేశవ్యాప్తంగా రైతులకు అవసరమగు వాతావరణ సమాచారం, వాతావరణ ఆధారిత ముందస్తు వాతావరణ సూచనలను రాష్ట్రాల, జిల్లాల, బ్లాక్ / సబ్ డివిజన్ల వారీగా అందుబాటులో ఉంటాయి.
- కరువు, తుఫానులు, వరదలు, ఉరుములు మెరుపులతో కూడిన వర్షాలు, అతి తీవ్ర చలి, వేడి వాతావరణ వంటి ఆపత్కాలిక, ప్రతికూల వాతావరణ స్థితిలో రైతులు చేపట్టవలసిన, చేయకూడని పనులు, సూచనలు అన్ని భాషలలో అందుబాటులో ఉంటాయి.
- ఈ వెబ్ సైట్ ద్వారా వాతావరణ సేవల కొరకు రైతులు వారి వివరాలను నేరుగా నమోదు చేసుకొనవచ్చు, వారు పొందిన వాతావరణ సేవలపై అభిప్రాయాన్ని అధికారులకు తెలియపరచవచ్చు.

**మేఘదూత్ యాప్ (Meghdoot app) :**

భారత – వాతావరణ విభాగం, భూ శాస్త్ర మంత్రిత్వ శాఖ, భారతీయ ఉష్ణ మండల వాతావరణ విజ్ఞాన సంస్థ, భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి సంయుక్తంగా, అంతర్జాతీయ పాక్షిక మెట్టప్రాంత పంటల పరిశోధనా సంస్థ (ఇక్రిశాట్) వారి సాకారంతో మేఘ దూత్యాప్‌ను అభివృద్ధి చేశారు. ఈ యాప్‌నకు కావలసిన సమాచారాన్ని రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయాల పరిధిలోని అగ్రోమేట్ ఫీల్డ్ యూనిట్స్ (ఎ.ఎం.ఎఫ్.యు.), జిల్లా వ్యవసాయ వాతావరణ విభాగం (డి.ఎ.ఎం.యు) వారు జిల్లాల వారీగా పొందుపరుస్తున్నారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం (పి.జె.టి.ఎస్.ఎ.యు.), ఆంధ్రప్రదేశ్లో ఆచార్య ఎన్. జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయాలు దాదాపుగా అన్ని జిల్లాల వ్యవసాయ వాతావరణ సమాచారాన్ని పొందుపరుస్తున్నారు.

- ఈ యాప్‌ను రైతుల స్మార్ట్ ఫోన్లో డౌన్లోడ్ చేసుకోని, రైతుల వివరాలను నమోదు చేసుకొని, మొబైల్ నంబరు సైన్ వినియోగించవచ్చు.

- ఈ మేఘదూత్ యాప్‌లో ఇంగ్లీష్, హిందీ భాషలతో పాటుగా మన ప్రాంతీయ భాష తెలుగులో కూడా సమాచారం అందుబాటులో ఉంటుంది.
- ఈ యాప్‌లో రైతులు వారీ ప్రాంతాలను జోడించి, ప్రాంతం గత వాతావరణం, ముందస్తు వాతావరణ సూచనలు తెలుసుకొనవచ్చు.
- ఈ యాప్ సమగ్ర వీక్షణ చిహ్నాన్ని ఎంచుకొని వారి జిల్లా ముందస్తు వాతావరణ అంచనా ఆధారిత వ్యవసాయ సూచనలను, ఉద్యాన పంటల సూచనలు, పశువుల పెంపకానికి కావలసిన సూచనలను పొందవచ్చును.
- ఈ యాప్‌లో ముందస్తు వ్యవసాయ సూచనలు ప్రతి మంగళ, శుక్ర వారాలలో పొందుపరచబడుతుంది.
- లింక్: Android:http://play.google.com/store/apps/details?id=com.aas.meghdoot IOS:http://apps,applie.com?in/app/meghdoot/id1474048155

**మౌసమ్యాప్ (Mausam app)** : భారత వాతావరణ విభాగం, భూశాస్త్ర మంత్రిత్వశాఖ వారు అంతర్జాతీయ పాక్షిక మెట్ట ప్రాంత పంటల పరిశోధనా సంస్థ, భారతీయ ఉష్ణ మండల వాతావరణ విజ్ఞాన సంస్థ (ఐ.ఐ.టి.ఎం.) సంయుక్త సహకారంతో ఈ యాప్ రూపొందించారు.

- ఈ యాప్ ద్వారా రైతులు ఇంగ్లీష్, హిందీ భాషలలో పాటు ప్రాంతీయ భాషలలో ప్రాంతాల వారీగా వాతావరణ సమాచారాన్ని పొందవచ్చును.
- ఈ యాప్‌లో రోజువారీ ఉష్ణోగ్రత, గాలిలోని తేమ శాతం, వర్షపాతం వివరాలతో పాటుగా రాబోయే 10 రోజుల ముందస్తు వాతావరణ సూచనలు అందుబాటులో ఉంటాయి.
- http://play.google.com/store/apps/details?id=com.imd.masuam

**దామినీ యాప్ (Damini app)** : భారతీయ ఉష్ణ మండల వాతావరణ విజ్ఞాన సంస్థ వారిచే రూపొందించబడిన దామిని యాప్ ద్వారా ఉరుములు, మెరుపుల రావడాన్ని ముందుగానే గమనించి అలెర్ట్ చేస్తారు.

- ఈ యాప్‌ను మొబైల్ ఫోన్లో నమోదు చేసుకొని వారి ప్రాంతాలను జోడించుకొని, ఆయా ప్రాంతాల 20 కి.మీ. 40 కి.మీ. పరిధిలో 0–5 నిముషాలు, 5–10 ని.లు, 10–15 నిమిషాల వ్యవధిలో ఉరుములు, మెరుపులను ముందస్తుగా అలెర్ట్‌ను పొందవచ్చు.
- ఈ యాప్‌లో ఉరుములు మెరుపులతో కూడిన వర్షంలో తీసుకోవలసిన జాగ్రత్తలు కూడా తెలిపారు.
- http://play.google.com/store/apps/details?id=com.lightening.live.damini

అందువల్ల రైతులు పైన తెలిపిన డిజిటల్ సేవలను వినియోగించుకొని సమయానుగుణంగా మారుతున్న వాతావరణ స్థితులను గమనించి, వాతావరణ పరిస్థితుల ఆధారంగా వ్యూహాత్మకంగా ప్రణాళికా బద్ధంగా నిర్ణయాలు తీసుకొని వ్యవసాయంలో అధిక దిగుబడులను సాధించే దిశగా అడుగులు వేయాలి.

తెలంగాణా రాష్ట్రములో వాతావరణ శాఖల వివరాలు https://tsdps.telangana.gov.in/ ఇవ్వబడిన లింక్ ఆధారంగా రాష్ట్రంలోని వివిధ జిల్లాల (28 జిల్లాల) వాతావరణ పరిస్థితులు ప్రతిరోజు ఇందులో తెలుపుతాయి. అలాగే వాతావరణ పరిస్థితుల ఆధారంగా వాతావరణ శాఖ వారు ప్రతి పంట గురించి చేసుకోవాల్సిన వ్యవసాయ పనులు మరియు జాగ్రతలు ఇందులో తెలియజేస్తారు.

**ఆంధ్రప్రదేశ్ వాతావరణ కార్యాలయాల వివరాలు:**

| జిల్లా | ఫోన్ నంబర్ | మెయిల్ |
|---|---|---|
| అనంతపూర్ | 08554 25517 | pboant@imd.gov.in |
| బాపట్ల | 08643 224880 | mobapatla@gmail.com |
| కాకినాడ | 0884 2376069 | met.kakinada@gmail.com |
| కర్నూల్ | 08518 230113 | mokvl@imd.gov.in |
| తిరుపతి | 08772275228 | amstpt@imd.gov.in, amstirupati@rediffmail.com |
| విశాఖపట్నం | 0891-2543031 | cwcvsk@gmail.com, cwcvsk@imd.gov.in |

■

# కర్ణాటకలో అనంత ఎఫ్ పి ఓ ల బృందం అవగాహన పర్యటన

– అనిత, సి.ఇ.ఓ, అనంత గ్రామీణ మహిళా ఎఫ్‌పిఓ

ఏఇఐఎన్ వారి సహకారంతో , ఏపిమాస్ అధ్వర్యంలో మహిళా రైతు ఉత్పత్తిదారుల సంస్థ (ఎఫ్ పి ఓ) డైరెక్టర్స్, సిబ్బంది బెంగళూరుకు 2022 జులై 5 వ తేదీ నుంచి 8వ తేదీ వరకు మూడు రోజుల అవగాహన పర్యటనకు వెళ్ళాము. అనంతపురం నుంచి “అనంత గ్రామీణ మహిళా రైతు ఉత్పత్తిదారుల సంఘం”, ధర్మవరం నుండి “భూమాత మహిళా రైతుల ఉత్పత్తిదారుల సంఘం” పాలకవర్గ సభ్యులతో పాటు సిఇఓలు, ఏపిమాస్ నుండి శ్రీ గంగాధర్, దివ్య గారు ఈ పర్యటనలో పాల్గొన్నారు.



మొదటి రోజు ఉదయం “సహజ ఆర్గానిక్” ఎఫ్ పి ఓ సందర్శనకు వెళ్ళాము. సహజ ఎఫ్ పి ఓ 2012 వ సంవత్సరంలో 40 మంది సభ్యులతో ప్రారంభమైంది. వీరు సేంద్రియ వ్యవసాయ పద్ధతులు పాటిస్తూ కూరగాయలను పండిస్తున్నారు. సహజ ఆర్గానిక్ వారు వ్యవసాయంలో పాటించ వలసిన మెలకువలు, సేంద్రియ వ్యవసాయ పద్ధతుల గురించి రైతులకు శిక్షణ ఇప్పించారు. వీరు ప్రణాళికాబద్ధంగా కూరగాయ పంటలను పండిస్తున్నారు. మొదట వారి ఇంటికి వాడుకొని మిగిలిన కూరగాయలను అమ్ముకుంటారు. ఏ రైతు ఎటువంటి పంట (కూరగాయలు) పెట్టాలి, ఎప్పుడు ఎలాంటి ఎరువులు వేయాలి అన్న విషయాలు, అన్ని ప్రణాళిక ప్రకారం అమలు పరచడం వీరి విజయానికి కారణం. నాణ్యతకు ప్రాధాన్యత ఇస్తూ, సభ్యులు తెచ్చిన సరుకు బాగా లేకపోతే వెనక్కు పంపడం కూడా జరుగుతుంది. వెనక్కు వచ్చిన సరుకును రైతులు మరొక చోట అమ్ము కోవచ్చు. రైతుకు మరుసటి రోజున ఎటువంటి కూరగాయలు, ఎంత మోతాదు కావాలి అన్నది ముందు రోజే నిర్ణయించి అందరికి ఫోన్ ద్వారా సమాచారాన్ని చేరవేస్తారు.

మొదటగా చిన్న సన్నకారు రైతులను మాత్రమే సభ్యులుగా చేర్చుకున్నారు. వీరికి మార్కెటింగ్ సమస్య అన్నదే లేదు. వీరు వారానికి రెండు రోజులు (శుక్రవారం, సోమవారం) మాత్రమే కూరగాయలు సరఫరా చేస్తారు. రోజుకు సుమారు 2 టన్నుల కూరగాయలు సరఫరా చేస్తారు. మార్కెట్ ధర కంటే 15% ఎక్కువ ధరకు అమ్ముతారు. అదనంగా వచ్చిన 15%లో 5% ఎఫ్ పి ఓ కు, 10% పండించిన రైతు ఖాతాకు జమ చేస్తారు. ప్రతి 15 రోజులకు ఒకసారి అమ్మకం నుండి వచ్చిన డబ్బును రైతుకు చెల్లిస్తారు. వీరు పండించే కూరగాయలకు మంచి డిమాండ్ ఉంది.

వీరికి ఒక కోల్డ్ స్టోరేజ్, గోడౌన్ కూడా ఉన్నాయి. వీరు కూరగాయలు, పప్పు దినుసులు, చిరుధాన్యాలతో పాటు కిరాణా సరుకుల వ్యాపారం కూడా చేస్తారు. వీరికి ఒక



దానం సంపాదనను శుద్ధి చేస్తుంది, క్షమాగుణం సంబంధాలను వృద్ధి చేస్తుంది




దుకాణం (ఔట్ లెట్) కూడా ఉంది. అక్కడ నెలకు సుమారు 10 లక్షలు వరకు లావాదేవీలు జరుగుతాయి. వీరి సరుకులను ఐఎంఓ వారు ధృవీకరణ చేస్తారు.

రెండవ రోజున (07-07-22 ) ఆనేకల్లు హార్టికల్చర్ ఎఫ్‌పిఓను సందర్శించాము. మొదటి రోజు ఒక స్ట్రాటజీతో నడిచే ఎఫ్ పి ఓ అయితే రెండవ రోజు చూసిన ఎఫ్‌పిఓ మరొక స్ట్రాటజీతో నడిచేది. ఆనేకల్లు ఎఫ్‌పిఓ 2016లో, మొత్తం 39 గ్రామాల నుండి 50 ఎఫ్‌ఐజి లతో, 1000 మంది సభ్యులతో ప్రారంభమైంది. ఈ ఎఫ్‌పిఓ లో 820 మంది పురుషులు 180 మహిళలు ఉన్నారు. వీటిలో మొత్తం 45 ఎఫ్‌ఐజిలను పురుషులతో, 5 ఎఫ్‌ఐజిలను మహిళలతో ఏర్పాటు చేశారు.

ఆనేకల్లు ఎఫ్‌పిఓకు శ్రీ సిద్దిరాజు సిఇఓ. ఆనేకల్లు ఎఫ్‌పిఓ వారు ముందుగా ఎఫ్‌ఐజి లను బలోపేతం చేయడంపై దృష్టి సారించారు. ప్రతి నెల క్రమం తప్పకుండా సమావేశాలను నిర్వహించారు. వీరు పలు రకాల వ్యవసాయానికి సంబంధించిన వ్యాపారాలు చేస్తున్నారు.

కూరగాయలు, ఫెర్టిలైజర్స్, వ్యవసాయ పనిముట్లు, పూల వ్యాపారం, ట్రాక్టర్‌ను బాడుగకు యివ్వడం చేస్తున్నారు. గొర్రెలపెంపకం, చేపల పెంపకం కూడా సాగిస్తున్నారు. వీరు మంచి ప్రణాళికతో పాలకవర్గ సభ్యులలో (బిఓడి) ఒక్కొక్కరికి ఒక్కొక వ్యాపార బాధ్యతను అప్పగించారు.

ఉదాహరణకు ఒక బిఓడి సభ్యుడు ట్రాక్టర్‌ను అద్దెకు యిచ్చే బాధ్యత తీసుకొని బాడుగ ద్వారా వచ్చిన సొమ్మును 15 రోజులకు ఒకసారి బ్యాంకులో డిపాజిట్ చేస్తారు. ఈ ఎఫ్‌పిఓ కు పోలిహౌసెస్, కోల్డ్ స్టోరేజ్, గోడౌన్, గొర్రెల పెంపకం యూనిట్లు మొదలైనవి ఉన్నాయి. ఎఫ్‌పిఓ ఆఫీస్ కోసం గవర్నమెంట్ వారు స్థలం కూడా యిచ్చారు. గవర్నమెంట్ పథకాలు గాని, ఎఫ్‌పిఓ చేపట్టే పథకాలు కాని ముందుగా క్రియాశీల సభ్యులకే ప్రాధాన్యత ఇస్తూ , ఎఫ్‌పిఓను బలోపేతం చేసుకుంటూ అభివృద్ధిపథంలో వెళతున్నారు.

ఇలా ఎఫ్‌పిఓ ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తూ, ఎఫ్ పి ఓకు చెందినవారందరూ బాధ్యతతో వ్యాపారం చేసుకుంటే కచ్చితంగా విజయం సాధించగలరనే విషయాన్ని మేము నేర్చుకోగలిగాము.

మాకు ఈ విషయాలన్నీ తెలియాలన్న ఆలోచనతో మమ్మల్ని బెంగుళూరుకు తీసుకెళ్ళినందుకు ఏపిమాస్ ప్రతినిధులు గంగాధర్ గారికి, దివ్యగారికి, ఈ అవకాశం



ఇచ్చిన ఏపిమాస్ సంస్థకు, సహకారాన్ని అందించిన ఏఇఐఎన్ కు మా ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశాము. ఇన్ని విషయాలు తెలుసుకోవడానికి మాకు సహకరించిన సహజ ఆర్గానిక్ వారికి, ఆనేకల్ ఎఫ్‌పిఓకు మా హృదయ పూర్వక ధన్యవాదాలు. ■

**అధికారం, ధనం జీవన ఫలాలు ; కుటుంబం, మిత్రులు జీవన మూలాలు, మూలం లేని ఫలం మరణం!**

# సంఘ 'బలానికి' సరైన చిరునామా ఈ వసంత!

– ప్రహల్లాద

**సా**ధారణ రైతు కుటుంబంలో జన్మించి, స్వయం సహాయ సంఘ సభ్యురాలిగా, నాయకురాలిగా, విద్యా వలంటీరుగా, రైతు సంఘం నాయకురాలిగా, రైతు మిత్రగా, ఉన్నత పాఠశాల మధ్యాహ్న భోజన నిర్వాహకులిగా ... యిలా ... వివిధ పాత్రలలో తన ప్రతిభను చాటిచెబుతూ, తన వ్యక్తిగత జీవితాన్ని సమాజ సేవకే అంకితం చేస్తున్న ఆదర్శమహిళ, ఆదర్శ మహిళా రైతు శ్రీమతి పి. వసంత. ఆమె నిర్వహించిన, నిర్వహిస్తున్న కార్యక్రమాల జాబితా చూస్తే అశ్చర్యమవుతుంది. 488 మహిళా సంఘాల, రైతు సంఘాల కుటుంబాలు వివిధ బ్యాంకుల నుంచి దాదాపు ఐదు కోట్ల రూపాయల రుణాలను పొందడంలో శ్రీమతి వసంత కీలకపాత్ర పోషించారు. రుణాలు వచ్చేలా చేయడమే కాకుండా, ఆ రుణ మొత్తాలతో వారు తమ జీవనోపాధులను మెరుగుపరచుకునే విధంగా నిరంతరం కృషి చేస్తుండడం ఆమె విశిష్ట నాయకత్వానికి నిదర్శనం!

మండలంలో ఏపిమాస్ ద్వారా చేపట్టిన అనేక కార్య క్రమాలలో చురుకుగా పాల్గొంటూ, ఆదర్శ రైతుగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నుండి ప్రశంసలు అందుకున్న మహిళామణి శ్రీమతి వసంత. మదనపల్లి ఏపిమాస్ బృందంతో శ్రీమతి వసంత తన మనోభావాలను ఈ క్రింది విధంగా పంచుకున్నారు.

వసంత పుట్టిన ఊరు చిత్తూరు జిల్లా మదనపల్లి మండలంలోని మిట్టపల్లి శ్రీ పి. గంగిరెడ్డి, శ్రీమతి పి. బయమ్మ దంపతుల నాల్గవ సంతానం ఈమె. స్వగ్రామం లోనే పాఠశాల విద్యను అభ్యసించింది. ఆమె 7వ తరగతి చదువుతున్నప్పుడే వసంత తల్లిని కోల్పోయారు. అప్పటినుండి తన తండ్రి బాగోగులతో పాటు కుటుంబ బాధ్యతలను చూసుకుంటూ కూడా ఉన్నత విద్య (ఎం.ఎ, బి.ఇడి) అభ్యసించడం ఆమె కార్యదక్షతకు సంకేతం. ఉపాధ్యాయ వృత్తిపై వున్న మక్కువతో వసంత చిన్నతిప్ప సముద్రం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కంప్యూటరు అధ్యాపకురాలిగా (విద్యా వలంటీరు) తన జీవన ప్రయాణం ప్రారంభించింది. దాదాపు 25 సంవత్సరాలు కంప్యూటరు, ఆంగ్లం, సామాజిక శాస్త్రం మొదలగు పాఠ్యాంశాలను పిల్లలకు బోధించారు. విద్యా వలంటీరు వ్యవస్థ రద్దు అయినప్పటికి, ఆమె సేవలను కొనసాగింప జేసుకోవాలని, పాఠశాల తల్లుల కమిటి ఆమెను మధ్యాహ్న భోజన నిర్వాహకురాలిగా కొనసాగిస్తున్నారు.



గ్రామస్థాయిలో అటు ప్రభుత్వం, యిటు ఏపిమాస్ లాంటి స్వచ్ఛంద సేవా సంస్థలు చేపట్టే వివిధ రకాల అభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొంటూ పేదలకు విశేషమైన సేవ చేసినందులకు శ్రీమతి వసంతమ్మ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి శ్రీ రోశయ్య, ఆరోగ్య, విద్యాశాఖ మంత్రి శ్రీమతి గల్లా అరుణకుమారి గార్ల చేతుల మీదుగా ఆదర్శ రైతుగా ప్రశంసా పత్రం, నగదు బహుమతిని అందుకుని, రెట్టించిన ఉత్సాహంతో పనిచేస్తున్నారు.

**ఏపిమాస్‌తో ప్రయాణం:**

మహిళా అభివృద్ధి సంస్థ 2016వ సంవత్సరం నుండి మదనపల్లి మండలంలో రైతు సంఘాలను, రైతు ఉత్పత్తిదారు సంస్థలను ప్రారంభించి వివిధ రకాల కార్యక్రమాలను అమలు చేయుచున్నది. మండలంలోని చిన్న తిప్పసముద్రం పంచాయతిలో ఏపిమాస్ కార్య క్రమాలను అమలు చేయడం కోసం రైతు మిత్రల ఎంపికలో భాగంగా వసంత గారిని ఎంపిక చేయడం జరిగింది.

ఒక రైతు సంఘం ప్రారంభంతో మొదలైన వసంత గారి ప్రస్థానం ప్రస్తుతం ఈ పంచాయతిలో 488 కుటుంబాలతో రైతు సంఘాలను ఏర్పాటు చేసి మండలంలోని ఇతర రైతు

మిత్రలకు ఆదర్శంగా నిలుస్తున్నది. మదనపల్లి కేంద్రంగా ఏర్పాటైన 'మర్యాదరామన్న పట్నం ఎఫ్ పి ఓ వ్యాపార కార్యక్రమాలను సభ్య రైతుల యిళ్ళ ముంగిటికి చేర్చడంలో తనదైన శైలిలో విజయవంతంగా నిర్వహిస్తుండడం విశేషం.

**ఏపిమాస్ ద్వారా పొందిన శిక్షణలు:**

రైతు మిత్రగా ఎంపికైన కొత్తలో ఏర్పాటు చేసిన ఆవాస శిక్షణ కార్యక్రమంతో పాటు పంచాయతీ స్థాయిలో, మండల స్థాయిలో ఏపిమాస్ నిర్వహించిన వివిధ శిక్షణలకు, ఏపిమాస్ రూపొందించిన "స్వయం అభ్యసన" శిక్షణ కరదీపికలపై ఏర్పాటు చేసిన శిక్షణలకు ఆమె క్రమం తప్పకుండా హాజరవుతున్నారు. ఇంతేకాకుండా ప్రతి నెల మండల స్థాయిలో, ప్రాజెక్టు స్థాయిలోఏర్పాటు చేసే వివిధ సమావేలకు ఆమె తప్పక హాజరవుతుండడం చెప్పుకోవలసిన విషయం.

**ప్రతి కార్యక్రమంలో నేనున్నానని......**

చిన్న తిప్పసముద్రం పంచాయతిలో మహిళా సంఘాల, రైతుసంఘాల అభివృద్ధి కోసం వ్యవసాయశాఖ, ఉద్యాణశాఖ, ప్రజారోగ్య శాఖ మొదలగు వివిధ శాఖలవారు తాము చేపట్టే అనేక రకాల కార్యక్రమాలను ప్రజల ముంగిటకు తీసుకొని పోయే క్రమంలో వసంత అందరికి 'తలలో నాలుక'అయింది.

**సంఘాలకు, బ్యాంకులకు మధ్య అనుసంధానకర్తగా ...**

మహిళా సంఘాలు, రైతు సంఘాల సభ్యులు రుణాలను పొందడంలో వసంత కీలక భూమిక పోషిస్తున్నారు. సంఘాల సమావేశాలు జరిపించడం మొదలు, బ్యాంకు రుణాలు పొందడానికి కావలసిన వివిధ రకాల పత్రాలను సిద్ధం చేయడంలోను, తీసుకున్న రుణాలను సద్వినియోగ పరచుకునేలా చూడడంలోను, అప్పులను తిరిగి చెల్లింపజేయడం లోను యిలా ప్రతి స్థాయిలో వసంత అనునిత్యం తోడ్పాటు అందిస్తుండడం వలన స్థానిక ఇండియన్ బ్యాంక్ వారికి వసంత చెపితే చాలు ఏ మాత్రం సంకోచించకుండా ఆ సంఘాలకు రుణాలు యిస్తాం అనే స్థాయికి వచ్చింది.

**43 సంఘాలు ... 448 మంది సభ్యులు**

సంఘాల ఏర్పాటులో, వాటి సక్రమ నిర్వహణలో శ్రీమతి వసంత అన్నీ తానే అయి, అంకితభావంతో పని చేస్తారు. 448 మంది సభ్యులతో 43 సంఘాలను ఏర్పాటుచేసి, ఆ సంఘాల సభ్యులు 480 లక్షల రూపాయల రుణాలు పొందేలా చేశారంటే సామాన్యమైన విషయమా! తాను ఏర్పాటుచేసిన మహిళా సంఘాలకు, రైతు సంఘాలకు తనే పుస్తక నిర్వాహకురాలిగా వుంటూ ప్రతినెల సంఘం సమావేశం జరిపిస్తూ, పుస్తకాలను ఎప్పటికప్పుడు వ్రాస్తున్న శ్రీమతి వసంతపై సంఘ సభ్యులు నమ్మకం పెంచుకున్నారు.

**ఏపిమాస్ అభివృద్ధి కార్యక్రమాలలో కీలక పాత్ర ...**

చిన్న తిప్పసముద్రం గ్రామ పంచాయతి పరిధిలో ఏపిమాస్ ద్వారా ఏర్పాటైన రైతు ఉత్పత్తిదారుల సంస్థ నిర్వహిస్తున్న అనేక అభివృద్ధి కార్యక్రమాలలో శ్రీమతి వసంత కీలకపాత్ర పోషిస్తున్నారు. రైతు సమృద్ధి కేంద్రం ద్వారా రైతులకు కావలసిన వివిధ రకాల ఎరువులు, పశువులదాణా, స్ప్రేయర్లు, టార్పాలిన్ పట్టలు మొదలగునవి రైతు సంఘాల సభ్యులకు చేరవేయడంలో భాగంగా ఆమె తన ఇంటినే గోడౌన్‌గా మార్చివేయడం చెప్పుకోదగ్గ విషయం. అంతేగాక ఏపిమాస్ ద్వారా చేపట్టిన వివిద టమాట విలువు గొలుసు కార్యక్రమాలు, ఆదర్శ నర్సరీల అభివృద్ధి, ప్రదర్శనా క్షేత్రాల అభివృద్ధి కార్యక్రమాలలో చురుకైన పాత్ర పోషిస్తున్నారు.

కోవిడ్ ఆపత్కాల సమయంలో టమాట రైతులకు తోడ్పాటు అందించాలన్న సదుద్దేశంతో ఏపిమాస్ సంస్థ రైతుల తోటల వద్ద నుండి టమాటలను కొనుగోలు చేసి గుజ్జు పరిశ్రమలకు అమ్మడం జరిగింది. ఈ బృహత్తర కార్యక్రమంలో పి. వసంత చురుకైన పాత్ర పోషించి తమ పంచాయతీలోని టమాట రైతులకు తోడ్పాటు అందించింది.

మదనపల్లి మండలంలో రైతుల అభివృద్ధికి ఏపిమాస్ చేపట్టిన అనేక కార్యక్రమాల ద్వారా చాలామంది రైతులు అభివృద్ధి చెందారని, అందులో తమ గ్రామ రైతులు ఆర్థికంగా ఎంతగానో లబ్ధి పొందుతున్నారని శ్రీమతి వసంత తెలిపారు.

తనకు ఈ గొప్ప అవకాశం కల్పించిన ఏపిమాస్ సంస్థకు, సి.ఈ.ఓ శ్రీ సి.ఎస్.రెడ్డి గారికి , ఏపిమాస్ సిబ్బందికి ఆమె కృతజ్ఞతలు తెలియజేశారు. ■

# అభివృద్ధి పథంలో 'సిరిసంపద' ఎఫ్ పి ఓ

ఏపిమాస్ "పదివేల రైతు కంపెనీల నమోదు, ప్రోత్సాహం" అనే కేంద్ర ప్రభుత్వ పథకంలో భాగంగా క్లస్టర్ ఆధారిత వ్యాపార సంస్థగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఏడు రైతు ఉత్పత్తిదారుల కంపెనీలను (ఎఫ్ పి సి లను) ఏర్పాటు చేసి, వాటి కార్యక్రమాలను పర్యవేక్షిస్తున్నది. అందులో రెండింటికి నాబార్డ్, ఐదింటికి ఎస్ ఎఫ్ ఎ సి సహకారం అందిస్తుంది. ఆ ఏడు రైతు కంపెనీలలో 'సిరికొండ సిరిసంపద ' రైతు ఉత్పత్తిదారుల కంపెనీ (ఎఫ్ పి సి) ఒకటి. దీని ప్రధాన కార్యాలయం సిరికొండ మండల కేంద్రమైన సిరికొండ గ్రామంలో వుంది. 2021వ సంవత్సరం జూలై 21వ తేదీనాడు ప్రొడ్యూసర్ కంపెనీగా నమోదు చేయబడింది. ఒక వంద ఎనభై మంది రైతులు వాటాదారులుగా వున్నారు. ప్రస్తుతం దీనికి గోర్బండే ప్రకాష్ గారు అధ్యక్షులుగా వున్నారు.

**శనగల కొనుగోలు కేంద్రం ప్రారంభం**

ఇది రిజిస్ట్రేషన్ అయిన తేది నుండి సంస్థ సభ్యులకు వారి ఉత్పత్తులను మెరుగైన ధరకు విక్రయించడంలో, మెరుగైన మార్కెటింగ్ సౌకర్యాన్ని కల్పించడంలో సహకారం అందిస్తూవున్నది. అందులో బాగంగానే 2021-22వ సంవత్సర యాసంగి (రబీ) సీజన్లో రైతుల శనగల ఉత్పత్తిని, రాష్ట్ర కోటా క్రింద కనీస మద్దతు ధరకు సిరికొండలోనే కొనుగోలు చేయడానికి, శనగల కొనుగోలు కేంద్రాన్ని మంజూరు చేయమని, తెలంగాణ రాష్ట్ర మార్క్‌ఫెడ్ వారికీ 2022 ఏప్రిల్ మొదటివారంలో ధరఖాస్తును ఇవ్వడం జరిగింది. చాల రోజులపాటు మార్క్‌ఫెడ్ జిల్లా కార్యాలయం, ప్రధాన కార్యాలయం, ఆదిలాబాద్, హైదరాబాద్ కార్యాలయాల చుట్టూ తిరిగాక, 2022 ఏప్రిల్ 28న తెలంగాణ మార్క్‌ఫెడ్ వారితో సిరికొండ సిరిసంపద రైతు కంపెనీ ఒప్పందం కుదుర్చుకొని, 2022 ఏప్రిల్ 30 వ తేదీన సిరికొండ మండలంలో శనగల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించడం జరిగింది.

**ప్రయోజనము**

ఈ కేంద్రం ద్వారా జరిగిన కొన్ని ముఖ్య ప్రయోజనాలు ఏంటంటే...

ఎ) రైతులు వారి ఉత్పత్తికి మంచి ధరను పొందారు.

బి) రైతులు రవాణా ఛార్జీని, ప్రతి క్వింటాల్‌కు దళారీకి చెల్లించే కమీషన్‌ను ఆదా చేసుకున్నారు.

సి) రైతులు తమ సమయాన్ని ఆదా చేసుకున్నారు. సిరికొండ మండల రైతులు తమ ఉత్పత్తులను విక్రయించేందుకు ఇచ్చోడ మండలం, ఆదిలాబాద్‌కు వెళ్లి కొనుగోలు కేంద్రాల వద్ద సుమారు 4 నుండి 5 రోజులు వేచి ఉండాల్సి వచ్చేది. ఇప్పుడు ఆ ఇబ్బంది లేదు.

డి) కొనుగోలు కేంద్రాన్ని నిర్వహించినందుకుగాను సిరిసంపద రైతు కంపెనీ కి మార్క్‌ఫెడ్ నుండి సుమారు ఒక లక్ష అరవైవేల రూపాయలు కమీషన్ పొందుతుంది.

ఒక వారంలో, 215 మంది రైతుల నుండి 320.30 టన్నుల పరిమాణ ఉత్పత్తిని కొనుగోలు చేసి గోదాముకి పంపించడం జరిగింది.

**సిరికొండ సిరిసంపద వివరాలు :**

- చిరునామా : ఇంటి నెం: 3-38, జమా మజీద్ ఎదురుగా, సిరికొండ గ్రామం మరియు మండలం, ఆదిలాబాద్ జిల్లా, తెలంగాణ, భారతదేశం, పిన్: 504308
- సి ఈ ఓ, సంప్రదింపు నెం: శ్రీ నిఖిల్‌రాజ్, 7660915762
- అధ్యక్షుడు , సంప్రదింపు నెం: శ్రీ జి ప్రకాష్ 7569963742
- ఇమెయిల్: sirikondasirisampadafpcl@gmail.com
- నమోదు సంఖ్య & నమోదు తేదీ: U01400TG2021PTC153342 & 21-07-2021

→

నీలో మార్పు రాకుండా ఇతరులలో మార్పు రావాలనుకోవడం అత్యాశ

# మహిళా సంఘటిత శక్తిగా ఎస్ హెచ్ జి లు !

**తె**లంగాణ రాష్ట్రంలో మహిళా స్వయం సహాయక సంఘాలను (ఎస్‌హెచ్‌జి), ఆ సభ్య మహిళలను సంఘటిత శక్తిగా తయారు చేస్తున్నాయని రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించింది. మహిళల ప్రభావం విద్య, విజ్ఞానం, రాజకీయం, వ్యాపారం, క్రీడలు తదితర రంగాలన్నింటిలోనూ విస్తరిస్తుందని ప్రభుత్వం తయారుచేసిన నివేదికలో వెల్లడించింది. తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలోని మహిళల సమగ్ర వికాసానికి అనేక కార్యక్రమాలను చేపట్టి అమలు చేస్తున్నది. అందులో భాగంగానే మహిళలను సంఘటిత శక్తిగా తయారు చేయడమే లక్ష్యంగా మహిళా స్వయం సహాయక సంఘాలను రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేశారు.

తెలంగాణ రాష్ట్రంలోని మహిళలో దాగిఉన్న శక్తిని సమాజానికి ఉపయోగపడటానికి రాష్ట్ర ప్రభుత్వం పట్టణ ప్రాంతాలతో పాటు గ్రామీణ ప్రాంతాలలో మహిళా స్వయం సహాయక సంఘాలను ఏర్పాటు చేసింది.

మహిళలను పొదుపువైపు మళ్ళించడం ద్వారా ఆ కుటుంబాన్ని ఆర్థికంగా బలోపేతం చేయడం, అదే సమయంలో ఆర్థిక క్రమశిక్షణ వైపు మళ్లించడం మహిళా స్వయం సహాయక సంఘాల ఏర్పాటులో ముఖ్య ఉద్దేశం.

రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాలలో 4,36,512 మహిళా స్వయం సహాయక సంఘాలు ఉన్నాయి. ఈ సంఘాలలో 46,66,523 మంది సభ్యులు ఉన్నారు. అనేకమంది స్వయం ఉపాధి అవకాశాలు మెరుగుపడ్డాయని నివేదిక తెలిపింది.

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావానికి ముందు రాష్ట్రంలో 3,60,311 స్వయం సహాయక సంఘాలు ఉండగా, తెలంగాణ ఏర్పడిన అనంతరం గత ఎనిమిదేళ్లలో 76,321 స్వయం సహాయక సంఘాలను కొత్తగా ఏర్పాటు చేయడం జరిగింది. రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాలలో ప్రస్తుతం 4,36,512 మహిళా స్వయం సహాయక సంఘాలు ఉన్నాయి.

గ్రామాలలో మహిళా సంఘాల ద్వారా తీసుకున్న రుణాల వల్ల అనేకమంది మహిళల స్వయం ఉపాధి అవకాశాలు మెరుగుపడ్డాయి. కార్యక్రమం పటిష్టంగా అమలు చేయడానికి రాష్ట్రంలో 32 జిల్లా సమాఖ్యలను ఏర్పాటు చేయబడ్డాయి. రాష్ట్రంలో 553 మండల సమాఖ్యలు, 17,954 గ్రామ సమాఖ్యలు పని చేస్తున్నాయి.

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తరువాత స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు లింకేజి గణనీయంగా పెరిగిందని, 2014–15 ఆర్థిక సంవత్సరంలో 1,96,447 స్వయం సహాయక సంఘాలకు 3739 కోట్ల రూపాయల బ్యాంకు లింకేజీ కల్పించగా, 2021–22 సంవత్సరంలో 2 లక్షల 56 వేల 779 మహిళా స్వయం సహాయక సంఘాలకు 12,200 కోట్ల 59 లక్షల రూపాయల బ్యాంకు లింకేజీ కల్పించబడిందని వెల్లడించింది.

■

---

- ప్రోత్సహించే సంస్థ పేరు: నాబార్డ్
- సి బి బి ఓ పేరు: ఏపిమాస్
- వాటాదారు రైతుల సంఖ్య: 180
  - మహిళా రైతుల సంఖ్య: 31
- చెల్లించిన వాటాధనము: 264600
- ప్రధాన పంటలు : సోయా, కంది, పత్తి, జొన్న , శనగ
- రైతు కంపెనీ కింద వున్నభూమి (హెక్టార్): 212
- సంస్థ వ్యాపార కార్యకలాపాలు:

ఎ. ఇన్‌పుట్ కార్యకలాపాలు:

ఎ) టార్పాలిన్ షీట్ల విక్రయాలు

బి. అవుట్‌పుట్ కార్యకలాపాలు:

ఎ) కనీస మద్దతు ధరకి మార్క్ ఫెడ్ ద్వారా శనగల సేకరణ

- సంస్థ ఆర్థిక టర్నోవర్ (రూ. లక్షల్లో): 5.41 లక్షలు

■

# బంతి, చేమంతి సాగులో మెళకువలు !

– చెంగల్రెడ్డి అనూష , శ్రీను

మన రెండు తెలుగు రాష్ట్రంలో అధిక విస్తీర్ణంలో సాగవుతూ, వాణిజ్య పరంగా పండించే విడిపూల పంటలలో ప్రధానమైనది బంతి. బంతిపూల వాడకం వరలక్ష్మీవ్రతం నుండి మొదలుకొని దసరా, దీపావళి సంక్రాంతి మరియు వివిధ జాతరలు, శుభాకార్యాల సమయంలో మార్కెట్ గిరాకిల చూసుకొని ఏడాది పొడువునా బంతిని సాగు చేసినట్లుంటే అధిక ఆదాయాన్ని పొందవచ్చు. ఈ బంతి పూలు ఆకర్షణీయంగా వివిధ రంగులు, బహుళ ప్రయోజనాలు తేలికైన సాగు విధానం ఉండడంతో పాటు ఎక్కువ కాలం నిలువ ఉండే స్వభావం ఉన్నందువల్ల పూల సాగుదార్లని ముఖ్యంగా చిన్న సన్నకారు రైతులు వీటిని సాగుచేసుకోడానికి అవకాశాలు ఎక్కువ ఉంది.



**నేలలు :**

బంతిని అన్ని నేలల్లో సాగు చేసినప్పటికీ సారవంతమైన గరపనేలలు అత్యంత అనుకూలమైనవి. మురుగు నీటి వసతి ఉన్నచో బరువైన నేలల్లో కూడా బంతిని సాగు చేయవచ్చు. నేల ఉదజని సూచిక 7–15 వరకు ఉంటే మంచిది.

**వాతావరణం :**

బంతిని వాతావరణ పరిస్థితులని బట్టి ఏడాది పొడవునా సాగు చేయవచ్చు. ఉష్ణోగ్రత 14–28 డిగ్రీ వద్ద బాగా పెరుగుతుంది. 10 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత కంటే తక్కువ లేదా 35 డిగ్రీల కంటే ఎక్కువ ఉష్ణోగ్రత ఎక్కువున్నా పూలపై తీవ్ర ప్రభావం చూపుతుంది. నీడ ప్రదేశాలను బంతి సాగుకు అనుకూలం కాదు. దీనివల్ల మొక్కలు పూలు పూయక, శాఖీయ దశలోనే ఉండిపోయాయి.

**రకాలు :ముఖ్యంగా రెండు రకాలు**

**ఆఫ్రికన్ బంతి**

- ఆఫ్రికన్ బంతి రకాలకు గిరాకీ ఎక్కువ.
- ఇవి ప్రధానంగా పసుపు, నారింజ రంగులతో ఆకర్షణీయంగా ఉండే పూలు.
- పూసా నారింగగైండా, పూసా బసంతిగైండా, అర్కా బంగార (పసుపు), మరియు అర్కా అగ్ని (నారింజ) అర్కా బంగార –2 మంచి దిగబడినిస్తున్నాయి.
- అయితే ఇవి కాండం కత్తిరింపుల ద్వారా మాత్రమే వ్యాప్తి చేసుకోవచ్చు. ఈ రకాలలో విత్తనం ఉండదు.

**ఫ్రెంచి బంతి**

- ఈ రకం మొదలు పొట్టిగా ఉండి దృఢంగా సింగిల్ లేక డబుల్ పువ్వులను కలిగి ఉండి ఆఫ్రికన్ బంతి రకాలకన్నా త్వరగా కోతకు వస్తాయి .
- అర్క పరి, అర్క హని రకాలు మంచి దిగుబడిని ఇస్తున్నాయి.

**నారు పెంపకం:–**

వాణిజ్యపరంగా బంతిని విత్తనాల ద్వారా వ్యాప్తి చేస్తారు. ఎకరానికి సరిపడా నారు పెంచడానికి 800 గ్రాముల విత్తనం అవసరమవుతుంది. మొలకశాతం బాగా ఉంటే ఎకరానికి 400–500 గ్రాముల విత్తనం సరిపోతుంది. నారు పెంచడానికి 15 సెం.మీ ఎత్తు 1 మీ వెడల్పు ఉన్న ఎత్తు నారు మడులను చేసుకొని, ఒక చదరపు మీటర్ నారుమడికి 8–10 కిలోల పశువుల ఎరువు వేసి బాగా కలపాలి. విత్తనాలు వారంలో మొలకెత్తుతాయి. విత్తనాలను ప్రోట్రెలలో

నాటినట్లయితే బలమైన నారు మొక్కలను తయారు చేసుకోవచ్చు .

25–30 దజుల, 3–4 ఆకులు కలిగిన నారును ప్రధాన పొలంలో నాటుకోవాలి.

**నాటుకొనే సమయం:–**

బంతిని అన్ని కాలాలకు సాగు చేసినప్పటికీ, ఒక నెల తేడాలో జూలై మూడవ లేదా ఆగష్టు మొదటి వారం వరకు నాటుకుంటే మార్కెట్‌కు సెప్టెంబర్ వరకు పూలు సరఫరా చేయవచ్చు.

**నాటుకొనే దూరం :**

1. ఆఫ్రికన్ రకాలు 60×45 సెం.మీ మొక్కల మధ్య
2. ఫ్రెంచ్ రకాలు 20×20 సెం.మీ మొక్కల మధ్య
3. మల్చింగ్, డ్రిప్ విధానంలో సాగు చేసుకొనేవారు 15 సెం.మీ ఎత్తు, 3 ఫీట్ల వెడల్పు గల బెడ్‌లపై 60×45 సెంమీ 60×60 సెంమీ దూరంలో త్రికోణాకారంలో నాటుకోవచ్చు.

**ఎరువుల యాజమాన్యం:–**

దుక్కిలో ఎకరానికి 8–10 టసుల పశువుల ఎరువు వేసి కలియదున్నాలి. వీటితో పాటు ఎకరానికి 30–40 కిలోల నత్రజని, 80 కేజీల భాస్వరం మరియు 80 కిలోల పొటాష్ వేసి దున్నుకోవాలి. జీవన ఎరువులు అజోస్పైరిల్లమ్ / అజటోబాక్టర్ / రైజోబియం / అజోటోబాక్టర్/ (నత్రజని), ఫాస్పేట్కరిగే బ్యాక్టీరియా (పిఎస్‌బి) (భాస్వరం), పొటాషియం సమీకరణ బ్యాక్టీరియా (పిఎంబి) (పొటాషియం), వంటి జీవన ఎరువులు వేసుకున్నట్లు అయితే మొక్క బలంగా ఉండి కోత తరువాత పూలు ఎక్కువ రోజులు నిలువ ఉంటాయి. మొక్కలు నాటుకొన్న 30 రోజుల తర్వాత మరో 40 కిలోల నత్రజని ఇచ్చే ఎరువులను పై పాటంగా వేసుకోవాలి.

**నీటి యాజమాన్యం :–**

- బంతి మొక్కలు అన్ని దశల్లోనూ సరిపడినంత తేమ భూమిలో ఉండాలి. మొక్క ఏ దశాలోనూ నీటి ఎద్దడికి గురయినట్లయితే మొక్క పెరుగుదల మరియు పూత దెబ్బ తింటుంది.
- బంతి పూల సాగు డ్రిప్, మల్చింగ్ విధానం ద్వారా సాగు చేసుకోవడం వల్ల సాగుఖర్చు, నీటి వాడకం తగ్గుతుంది. మరియు మల్చింగ్ వల్ల కలుపు పెరగకుండా నివారించుకొని కలుపు నివారణలు అయ్యే ఖర్చును ఆదా చేసుకోవచ్చు.

**కలుపు యాజమాన్యం :–**

వర్షాకాలంలో బంతిపూల సాగులో కలుపు బెడద అధికంగా ఉంటుంది. పంట కాలంలో 3–4 సార్లు కూలీల సహాయంతో కలుపును తీయించాలి. కలుపు నివారించకపోతే బంతి మొక్కలలో పోషకాలు నీటికోసం పోటీపడి బంతి పూల దిగబడిని, నాణ్యతను తగ్గిసాయి.

**తలలు తుంచడం / పించింగ్:**

ఆఫ్రికన్ రకాలను నాటిన 40 రోజులకు, హైబ్రిడ్లను నాటిన 20 రోజులకు, తలలు తుంచడం ద్వారా ప్రక్క కొమ్మలు అధికంగా వచ్చి, ఎక్కువ మోతాదులో పూలు వస్తాయి.

**పూలకోత :–**

పొలంలో నాటుకొన్న రెండు నెలల తర్వాత నుంచి పూల దిగుబడి మొదలయ్యి మొదటి కోత నుంచి మంచి రెండు లేదా రెండున్నర నెలల వరకు పూత వస్తుంది. పూలను 3–5 రోజులకొకసారి తీసుకోవచ్చు. పువ్వులు బాగా విచ్చుకున్న బంతి పూలను ఉదయం లేదా సాయంత్రం వేళల్లో కోయడం మంచిది. పువ్వులకు ముందు నీరు ఇచ్చినట్లయితే పువ్వులు తాజాగా ఎక్కువకాలం నిల్వ వుంటాయి. కోసిన తరువాత పువ్వులను తడిసిన గోనె లేదా వెదురు బుట్టలో ఉంచి తడిగుడ్డను కప్పి మార్కెట్ తరలించాలి.

**పూల దిగుబడి :**

సాధారణంగా ఆఫ్రికన్ రకాలు ఎకరానికి 4–5 టన్నులు హైబ్రిడ్ రకాలు 6–8 టన్నులు పూల దిగుబడిని ఇస్తాయి. పైన పేర్కొన్న విధంగా మార్కెంట్ డిమాండ్ ఆధారంగా బంతిని సాగు చేసి రైతులు అధిక ఆదాయాన్ని పొందవచ్చు.

**సమగ్ర సస్యరక్షణ**

పేనుబంక పిల్ల మరియు పెద్ద పురుగులు ఎదుగుతున్న

పూమొగ్గల నుండి రసాన్ని పీలుస్తాయి. పేనుబంక సాధారణంగా రసాయన నత్రజని ఎరువులు అధికంగా వాడినట్లయితే పురుగు ఉద్రిక్తత ఎక్కువగా ఉంటుంది కావున రసాయన నత్రజని ఎరువులను తగ్గించి వాడాలి. నివారణకు థయామెథాక్సామ్ 0.2 మీ.లీ లీటరు నీటికి కలిపి 15 రోజుల వ్యవధిలో మందులు మార్చి పిచికారి చేయాలి. లేదా వేపనూనెను 5 మి.లీ లీటర్ నీటికి కలిపి అధిక సాంద్రతతో పిచికారి చేసినట్లు అయితే నివారించవచ్చు.

**తామర పురుగులు :** ఇవి ఆకుల, పూల రసాన్ని పీలుస్తాయి. ఆకుల మీద తెల్లని మచ్చలు కనిపిస్తాయి నివారణకు ఇమిడక్లోప్రిడ్ 1మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. లేదా ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో జీవమృతం, ఘన జీవమృతం వంటి కషాయాలు వాడినట్లు అయితే ఖర్చు తగ్గించి పురుగును నివారించుకోవచ్చు. అలాగే పూలు కోసిన తరువాత కూడా ఎక్కువ రోజులు నిల్వ వుంటాయి.

**మొగ్గ తొలిచే పురుగు :** ఈ పురుగుల లార్వా పువ్వు లోపలి భాగాలను తినడం వలన మొగ్గలు విచ్చుకోవు. నివారణకు ప్రొఫెనోఫాస్ 2 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

### చేమంతి

**మ**న రాష్ట్రంలో వాణిజ్య పరంగా పండించే పూల పంటల్లో ప్రధానమైనది చేమంతి. ఇవి మనకు వివిధ రంగులలో లభిస్తూ, ఆకర్షణీయంగా ఉండటమే కాకుండా వీటిని పూజా కార్యక్రమాలు, పండుగలు, శుభకార్యాలలో కట్ ఫ్లవర్ , దండల తయారీకి విరివిగా ఉపయోగిస్తుంటారు. ముఖ్యంగా చలికాలంలో ఈ పూల లభ్యత అధికంగా ఉంటుంది (అనగా అక్టోబర్, నవంబర్ నుండి మార్చి వరకు లభ్యమవుతాయి).

మన రాష్ట్రంలో సాగులో ఉన్న చామంతి రకాలను నక్షత్ర చామంతి (చిట్టి చామంతి), పట్నం చామంతి (మధ్యస్థ పూలు) మరియు పెద్ద సైజు పూలుగలవిగా విభజించవచ్చు.

**రకాలు:** చామంతి వివిధ ఆకారాలు, రంగులలో లభ్యమవుతాయి. మన రాష్ట్రంలో ముఖ్యంగా సాగయ్యేవి తెలుపు, పసుపు మరియు ఎరుపు రకాలు.

**తెలుపు రకాలు :**అర్కచంద్రిక, అర్క చంద్రకాంత్, పూర్ణిమ, డాలర్ వైట్ రతామ్ సెలక్షన్, బగ్గి,రత్లామ్, సెలక్షన్, ఐ.ఐ.హెచ్.ఆర్–6

**పసుపు రకాలు :**అర్క ఎల్లో గోల్డ్, కో–1, రాయచూర్, బసంతి, పూనమ్, రాయచూర్, సిల్వార్.

**ఎరుపు రకాలు :** రెడ్ గోల్డ్, కో–2.

**వాతావరణం :** ఇది శీతాకాలపు పంట. తేమ ఎక్కువగా ఉండి, పూలు పూసేటప్పుడు తక్కువ ఉష్ణోగ్రతలు ఉండే ప్రాంతాలు ఈ పంట సాగుకు అనుకూలం. పగటి సమయం



ఎక్కువ ఉన్నప్పుడు చామంతి మొక్కలు శాఖీయంగా మాత్రమే పెరుగుతాయి.

**నేలలు :** సేంద్రియ పదార్థం అధికంగా ఉండే ఒండ్రు నేలలు, ఎర్ర గరప నేలలు అనుకూలం. ఉదజని సూచిక 6–7 మధ్య ఉండాలి. మురుగు నీటి పారుదల సరిగా లేని ఎడల మొక్కలు చనిపోతాయి.

**ప్రవర్ధనం:** పిలకలు మరియు కొమ్మ కత్తిరింపుల ద్వారా ప్రవర్ధనం చేస్తారు. పూల కోతలు అయిన పిమ్మట ఫిబ్రవరి–మార్చి నెలలందు మొక్కల నుంచి పిలకలను కత్తిరించి నారుమడిలో నాటుకోవాలి. మొక్కలని కొమ్మ కత్తిరింపుల ద్వారా ప్రవర్ధనం చేసుకుంటే మొక్కలు ఆరోగ్యంగా వుండి పూల నాణ్యత బాగుంటుంది. వేర్లు తొడిగిన పిలకల్ని జూన్, జులైలో నాటుకోవాలి.

**కొమ్మ కత్తిరింపులు :** ఏపుగా పెరుగుతున్న కొమ్మలు 10 సెం.మీ ఉండేలా కత్తిరించి నేరుగా లేదా ఇండోల్బ్యుటారిక్ ఆమ్లం 2500 పి.పి.యం ద్రావణంలో ముంచి మళ్ళలో

గాని కోకోపీట్ నింపిన ప్రోట్రేలలో గాని నాటుకోవాలి. 20–25 రోజులలో ఈ కొమ్మలకు వేరు వ్యవస్థ అభివృద్ధి చెంది ప్రధాన పొలంలో నాటుకోవడానికి అనుకూలంగా ఉంటాయి.

*"కొమ్మల ద్వారా ప్రవర్ధనం చెందిన మొక్కలు త్వరగా పెరిగి పూల దిగుబడి కూడా అధికంగా ఉంటుంది"*

**నాటే సమయం :** జూలై నుండి ఆగష్టు మాసాల్లో నారు మొక్కలను నాటినట్లయితే నవంబర్ – డిసెంబర్ మాసాల్లో పూస్తాయి. పండగల సీజన్ ను దృష్టిలో ఉంచుకొని ఒక్కసారి కాకుండా 15–20 రోజుల వ్యవధిలో రెండు దఫాలుగా నాటితే పూలను ఎక్కువ కాలం పొందే అవకాశం ఉంటుంది.

**నాటే దూరం :** చిన్న పూల రకాలైన నక్షత్ర చామంతి 30 × 20 సెం.మీ, దూరంలో నాటుకోవాలి. ఇవి ఎకరాకు 55,000 నుండి 60,000 మొక్కలు అవసరమవుతాయి. నాటుటకు ముందు ఒక ఎకరాకు 10 టన్నుల పశువుల ఎరువు, 60–80 కిలోల నత్రజని, 30–40 కిలోల భాస్వరం మరియు 60–80 కిలోల పొటాష్ వేసుకోవాలి.

- పెద్ద పూల రకాలను 90 ఐ 60 సెం.మీ. లేదా 90×75 సెం.మీ. దూరంలో నాటుకోవాలి. ఇవి ఎకరాకు 8000 నుండి 9000 మొక్కలు అవసరమవుతాయి.

**నీటి యాజమాన్యం :** వాతావరణాన్ని బట్టి మరియు నేల తీరును బట్టి ఇవ్వాలి. నాటిన మొదటి నెలలో వారానికి 2–3 సార్లు, అటు పిమ్మట వారానికి ఒక తడి యివ్వాలి.

**తలలు తుంచటం (పించింగు) :** నారు నాటిన నాలుగు వారాల తరువాత చామంతి మొక్కల తలలను తుంచి వేయాలి. ఈ విధంగా చేయడం వలన నిలువు పెరుగుదల ఆగి ప్రక్క కొమ్మలు ఎక్కువగా వస్తాయి. దీని వలన పూల దిగుబడి అధికంగా వస్తుంది మరియు పంట కూడా కొంత ఆలస్యంగా వస్తుంది.

**ఊతమివ్వడం :** చామంతి మొక్కలు పూలు పూసేటప్పుడు బరువుకి వంగి పోకుండా వెదురు కర్రతో ఊతమివ్వడం మంచిది.

**ఎరువుల యాజమాన్యం :** ప్రధాన పొలంలో మొక్కలు నాటే ముందు ఎకరాకు 10 టన్నుల పశువుల ఎరువు, 60–80 కిలోల నత్రజని, 30–40 కిలోల భాస్వరం మరియు 60–80 కిలోల పొటాష్నిచ్చే ఎరువులను వేసుకోవాలి.

***"మొక్కల ఎదుగుదల దశలో ప్రతి 20 రోజులకొకసారి సూక్ష్మధాతు (జింక్ సల్ఫేట్, మెగ్నీషియం సల్ఫేట్, సూపర్ ఫాస్ఫేట్) మిశ్రమంను పిచికారి చేసినట్లైతే దిగుబడి పెరుగుతుంది".***

**హార్మోన్ల వాడకం :** 100 పి.పి.యం. (100 మి.గ్రా. లీటరు నీటిలో) నాఫ్థలిన్యాసిటిక్ ఆమ్లాన్ని మొగ్గ దశ కంటే ముందుగా పిచికారి చేస్తే పూతను కొంత ఆలస్యం చేయవచ్చు. 100–150 పి.పి.యం. జెబ్బరిల్లిక్ ఆమ్లాన్ని పిచికారి చేస్తే 15–20 రోజుల్లో త్వరగా పూతకు వస్తుంది.

**పూలకోత :** జూలై – ఆగష్టులో నాటిన మొక్కల నుండి అక్టోబర్, నవంబర్లో పూలు కోసుకోవచ్చు. పూలను సాయంత్రం లేదా ఉదయం పూట కోసి సంచులలో నింపి దూర ప్రాంతాలకు పంపవచ్చు. సంచులలో పై నింపేటప్పుడు పూలపై నీరు చల్లరాదు.

**దిగుబడి :** ఎకరాకు 5–8 టన్నుల పూల దిగుబడి పొందవచ్చు. ఒక పంట కాలంలో దాదాపు 10–15 సార్లు పూలు కోయవచ్చు.

పూల కోత తరువాత చామంతి మొక్కలను నేలకు దగ్గరగా కత్తిరించినట్టయితే కత్తిరించిన భాగం నుంచి పిలకలు వచ్చి వాటిని మరలా నాటుకోడానికి ఉపయోగపడతాయి. పిలకల పెరుగుదలకు పైపాటుగా పశువుల ఎరువు, సూపర్ ఫాస్ఫేట్ వేయవలసి ఉంటుంది. అలా కాకుండా పంట తీసేసే ముందు కొమ్మ కత్తిరింపులను తీసుకొని నారుమడిలో పెట్టుకోవచ్చు. నారుమడిలో పెట్టే ముందర కొమ్మ కత్తిరింపులకు కాపర్ ఆక్సిక్లోరైడ్ 1 గ్రాము ఒక లీటరు నీటిలో కలిపిన ద్రావణంలో ముంచి నారుమడిలో నాటుకోవాలి. కత్తిరింపులకు వేర్లు బాగా రావాలంటే ఐబిఎ

**ఆత్మవిశ్వాసం లేకుంటే అణువైనా కొండలా భయపెడుతుంది. అదే వుంటే కొండ కూడా అణువే**

2500 పిపిఎం ద్రావణంలో కాని సెరాటిక్స్‌లో కాని ముంచి నారుమడిలో నాటుకోవాలి.

సస్యరక్షణ చామంతి పంటకు ముఖ్యంగా పచ్చపురుగు, ముడత మరియు ఆకు తొలుచు పురుగు ఎక్కువగా నష్టం కలగచేస్తాయి

**పచ్చ పురుగు :** ఈ గొంగళి పురుగులు ఆకులను, పువ్వులను మరియు మొగ్గలను ఆశించి తీవ్రంగా నష్టపరుస్తాయి. నివారణకు క్లోరాంట్రా నిలిప్రోల్ 0.3 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

**తామర పురుగులు :** ఇవి గుంపులు గుంపులుగా చేరి రసాన్ని పీల్చి వేయడం వల్ల ఆకులు ముడతలు పడి ఎండిపోతాయి. పురుగు ఉద్రికతను తగ్గించటానికి నీలి రంగు జిగురు అట్టలు ఒక ఎకరాకు సరాసరి 10-12 వరకు ఏర్పరచుకోవాలి. లేదా నివారణకు ఫిప్రోనిల్ 2 మి.లీ. లేదా స్పైనోసాడ్ 0.25 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

**పేను బంక :** అన్ని రకాల దశల పురుగులు పువ్వుల్ని మరియు మొగ్గల్ని ఆశించి తీవ్రంగా నష్టపరుస్తాయి. పురుగును వేప నూనె 5 మి.లి. ఒక లీటర్ నీటికి కలిపి అధిక సాంద్రతతో, లేదా ఆక్సీడెమటాన్మిథైల్ 3 మి.లీ. లేదా ఫిప్రోనిల్ 0.3 మి.లీ. లేదా పైరిప్రాక్సీఫెన్ 1.5 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

**త్రిప్సు :** ఇవి గుంపులు గుంపులుగా చేరి రసాన్ని పీల్చివేయడం వల్ల ఆకులు ముడతలు పడి ఎండిపోతాయి. పూలు కూడా వాడిపోతాయి. నివారణకు డైమిథోయేట్ 1.5మి.లీ. లేక కార్బరిల్ 50% పొడిని 3 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

**తెగుళ్ళు :**

**ఆకుమచ్చ :** నల్లటి లోతైన గుండ్రటి మచ్చలు ఆకులపై ఏర్పడటం వల్ల ఆకులు ఎండి వడలిపోతాయి. నివారణకు క్లోరోథాలోనిల్ 1 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

**వేరుకుళ్ళు తెగులు :** వర్షాలు అధికంగా ఉన్నప్పుడు ఈ తెగులు ఉధృతి ఎక్కువగా ఉంటుంది. మొక్కలు ఆకస్మాత్తుగా వడలిపోతాయి. ఆకులు ఎండిపోయి రాలిపోతాయి. నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రా. లీటరు నీటికి కలిపి మొక్క మొదళ్ళ వద్ద పోయాలి. 2 కిలోల ట్రైకోడెర్మా పశువుల ఎరువులో కలిపి చివరి దుక్కిలో వేయాలి.

**బూడిద తెగులు :** ఈ తెగులు ఆశించిన మొక్కలు సరిగా ఎదగవు. ఆకుల అడుగు భాగాన తెల్లటి ఉబ్బెత్తు మచ్చలు ఏర్పడతాయి. ఈ తెగులు నివారణకు అజాక్సీస్ట్రోబిన్ 1 మి.లీ. లేదా ట్రైఫ్లాక్సీస్ట్రోబిన్ + ట్రిబ్యుకొనజోల్ 0.75 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. పైన తెలిపిన విధంగా సరైన యాజమాన్య పద్ధతులు పాటించినట్లయితే రైతులు అధిక దిగుబడిని పొందవచ్చు. ■

## లిక్విడ్ యూరియాపై రైతులకు అవగాహన కల్పించండి : ఏడీ

**వం**ద శాతం ఉపయోగం, పర్యావరణ సమతుల్యత, తక్కువ ధర కలిగిన లిక్విడ్ యూరియా వాడకంపై రైతులకు అవగాహన కల్పించాలని ఏపీమాస్ స్వచ్ఛంద సేవా సంస్థకు పీలేరు వ్యవసాయ శాఖ ఏడి రమణరావు సూచించారు. పీలేరు ఏఎంసి ప్రాంగణంలోని ఏపీమాస్ కార్యాలయాన్ని ఆయన ఇటీవల తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంతవరకు బస్తాల రూపంలో వస్తున్న యూరియా వల్ల వేస్టేజీ, పర్యావరణ అసమతుల్యత, ఎక్కువ శ్రమ వంటి సమస్యలు ఉన్నాయని, వాటిని అరికట్టడానికి ఇఫ్కో వారు లిక్విడ్ యూరియా బాటిళ్లను రూపొందించారని తెలిపారు. లిక్విడ్ రూపంలో ఉన్న యూరియాను పంటలు వందశాతం వినియోగించుకుంటాయని, తద్వారా దిగుబడి పెరుగుతుందన్నారు. ఈ విషయాలన్నిటినీ రైతులకు వివరించి వారిని చైతన్యవంతుల్ని చేయాలని ఏపీమాస్ సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీమాస్ ప్రాజెక్ట్ మేనేజర్ భార్గవి, టి ఏ షణ్ముగం, హెచ్‌వో సుకుమార్, డిఏఏబి సభ్యుడు బోధిషా వలి పాల్గొన్నారు.

# డ్రోన్ కొనుగోలుపై ఎఫ్ పి ఓలకు 40 శాతం రాయితీ !

అధునాతన పరిజ్ఞానంతో పనిచేసే డ్రోన్ కొనుక్కుని దానిపై ఉపాధి పొందాలనుకుంటున్నారా? టమాట, ఆలుగడ్డ, ఉల్లిగడ్డ పంటల ఉత్పత్తులను మార్కెటింగ్ చేయడం ద్వారా వ్యాపారం చేయాలనుకుంటున్నారా? అయితే మీకు రుణాలివ్వడానికి బ్యాంకులు సిద్ధంగా ఉన్నాయి. పది మంది రైతులు సంఘంగా ఏర్పడి రూ.10 లక్షల విలువైన డ్రోన్ కొంటే అందులో రూ. 4 లక్షలు (40%) నేరుగా కేంద్రం ఇస్తుంది. సంఘంలో వ్యవసాయ పట్టభద్రుడైన రైతు ఉంటే కేంద్ర సాయం రూ. 5 లక్షలకు (50%) పెరుగుతుంది. అయితే తొలుత రైతు సంఘం రూ. లక్ష వాటాగా కట్టాలి. వ్యవసాయ మౌలిక సదుపాయాల నిధి (ఏఐఎస్) కింద తెలంగాణలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.1232 కోట్ల రుణాలివ్వాలన్నది కేంద్ర లక్ష్యం. వీటిపై అవగాహన లేక రైతులు ఉపయోగించుకోవడం లేదని 'రాష్ట్ర వ్యవసాయ పరిశ్రమల అభివృద్ధి సంస్థ (ఆగ్రోస్) గుర్తించింది. దీంతో తమ 1,020 సంఘాల ద్వారా దరఖాస్తులు వచ్చేలా ఆ సంస్థ కృషి చేస్తోంది. జిల్లాల్లోని రైతులైన మహిళా స్వయం సహాయక సంఘాలు, రైతు ఉత్పత్తిదారుల సంఘాలు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు (ప్యాక్స్) సభ్యులకు అవగాహన కల్పించాలని నాబార్డు నిర్ణయించింది. దేశవ్యాప్తంగా రూ.లక్ష కోట్లతో కేంద్రం ఏఐఎఫ్‌ను అమలు చేస్తోంది. ఇప్పటివరకూ అన్ని రాష్ట్రాల నుంచి 23,400కి పైగా దరఖాస్తులు అందితే అందులో 5.4 శాతమే తెలంగాణ నుంచి ఉన్నాయి. అన్ని రాష్ట్రాలకు కలిపి 2021-22 ఆర్థిక సంవత్సరం నుంచి ఈ ఏడాది జూన్ వరకు రూ.9.53 కోట్ల రుణాలను వివిధ ప్రాజెక్టులకు మంజూరు చేస్తే అందులో తెలంగాణవి రూ.359 కోట్లు మాత్రమే.


**రాయితీలు... రుణాలు**

రైతు లేదా మహిళా సంఘాలు ఏఐఎఫ్ కింద దరఖాస్తు చేస్తే రూ.2 కోట్ల వరకూ రుణం ఇస్తామని నాబార్డు రాష్ట్ర ప్రభుత్వానికి తెలిపింది. ప్యాక్స్ ఈ రుణం తీసుకుంటే దానిపై ఒక శాతమే. వడ్డీ ఉంటుంది. మిగిలిన వారికి గరిష్టంగా 35% వడ్డీ వేస్తే అందులో 3% కేంద్రం రాయితీగా భరిస్తుంది. సంఘాలు ఆన్ లైన్లో ఏఐఎఫ్ పోర్టల్‌లో దరఖాస్తుచేస్తే బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరు చేస్తామని నాబార్డు సీజీఎం శ్రీ వై కృష్ణారావు. చెప్పారు. ■

## ఎఫ్‌పిఓలకు 2 కోట్ల రూపాయల వరకు రుణాలు

అగ్రికల్చర్ ఫండ్ సీ ద్వారా వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు, ఎఫ్‌పిఓలు సుమారు 2 కోట్ల రూపాయల వరకు రుణం పొందొచ్చని అగ్రికల్చర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ జాయింట్ సెక్రటరీ సామ్యూల్ ప్రవీణ్ తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఆగ్రోస్ సంస్థ, మేనేజ్, గవర్నమెంట్ ఆఫ్ అగ్రికల్చర్ ఫార్మర్స్ వెల్ఫేర్, గవర్నమెంట్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో అగ్రో రైతు సేవా కేంద్ర నిర్వాహకులతో పాటు రైతు ఉత్పత్తిదారుల సంఘాలు, 60 మంది రైతులకు అగ్రికల్చర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ స్కీంపై ఇటీవల హైదరాబాద్‌లో అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రవీణ్ మాట్లాడుతూ ఈ స్కీం ద్వారా తీసుకున్న రుణానికి 3 శాతం వడ్డీ కట్టాల్సి ఉంటుందన్నారు. ఇందుకు రెండేళ్ల మారటోరియం కల్పిస్తూ కొల్లేటరల్ సెక్యూరిటీ లేకుండా రీపేమెంట్‌కు ఏడేండ్ల అవకాశం ఇస్తున్నట్టు తెలిపారు.

అగ్రోస్ ఎండీ కె. రాములు మాట్లాడుతూ అగ్రి ఎంటర్ ప్రెన్యూర్లకు ఈ స్కీం సదవకాశమని, దీని అమలులో తెలంగాణ దేశంలోనే 5వ స్థానంలో ఉన్నదని చెప్పారు. ఈ పథకంలో రూ.3.075 కోట్ల టార్గెట్ రాష్ట్రానికి ఉన్నా కేవలం 359 కోట్ల రూపాయలు మాత్రమే వినియోగించు కున్నామని వివరించారు.


नाबार्ड
అభివృద్ధి
కోసం
పారిశుధ్యం
నాబార్డు సౌజన్యంతో
చిరు ప్రయత్నం, గొప్ప ప్రగతి
స్వచ్ఛత ఉద్యమం
నీళ్ళ ట్యాంకు మరియు రెండు గుంతల మరుగుదొడ్డి
దీర్ఘ కాలం అందించెను మీకు సేవలు
गाँव बढ़े >> तो देश बढ़े
www.nabard.org
YouTube /nabardonline
Taking Rural India >>Forward

MAHILA SADHIKARATHA
Publication Date: 01-08-2022 ; Posting Date: 05 & 06-08-2022

RNI Regd No: TELTEL / 2003 /16365
Postal Regd No: HD/1064/2021-23

## 'మహిళా సాధికారత' 20 వ వార్షికోత్సవం, ఏపిమాస్ 21 వ వార్షికోత్సవ సంరంభం... మరి కొన్ని దృశ్యాలు



ఏపిమాస్ కుటుంబం







జ్యోతి ప్రజ్వలన ... ఛైర్మన్ శ్రీ కె. మాధవరావు ప్రసంగం ... కేక్ కటింగ్







పాట్నాలో ఎఫ్ పి ఓలు, ఎస్ హెచ్ జి సంస్థలపై ఏపిమాస్ , బి ఆర్ ఎల్ పి ఎస్ రాష్ట్రస్థాయి వర్క్‌షాప్ ... మరికొన్ని దృశ్యాలు







మదనపల్లిలో ఏపిఎంఐపి వర్క్‌షాప్ ... వార్షిక మహాసభలు : కౌండిన్య ఎఫ్ పి ఓ చే , వి కోట ఎఫ్ పి ఓ చే ...

To ADDRESS



రాజమండ్రిలో స్టేట్ బ్యాంక్ చే ఏపిమాస్ కు అంబులెన్స్ అందజేత

బట్వాడా కాకపోతే దయచేసి ఈ చిరునామాకు తిప్పిపంపండి

ఎడిటర్, ఏపిమాస్ కార్యాలయం, ప్లాట్ నెం.11-12, హుడా కాలని, తానీషా నగర్, డ్రీమ్ వ్యాలీ దగ్గర, మణికొండ, రంగారెడ్డి జిల్లా, హైదరాబాదు-500089